

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM


# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను




జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777

రంగారెడ్డి బుధవారం 15-07-2026 సంపుటి: 02 సంచిక : 74 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Wednesday, 15-07-2026 Volume :02 Issue: 74 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani

## పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు
# పూర్తి చేస్తాం

### ఇందిరమ్మ పాలనలో సంక్షేమం, అభివృద్ధి

- గృహజ్యోతితో అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- పాలమూరు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలే ప్రభుత్వ లక్ష్యం
- రైతు భరోసా నిధులు ఇప్పటికే ఖాతాల్లో జమ: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- తెల్ల రేషన్ కార్డు కుటుంబాలకు రూ.5 లక్షల ఉచిత బీమా
- విద్యార్థులకు అల్పాహారం.. వడ్లకు బోనస్‌తో రైతుకు అండ
- సంక్షేమం--అభివృద్ధే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన ఎజెండా
- గద్వాలలో రూ.376.25 కోట్ల విద్యుత్ ప్రాజెక్టులకు శ్రీకారం

జోగులాంబ గద్వాల

పాలమూరు జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి వ్యవసాయానికి సాగునీరు అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన డిప్యూటీ సీఎంకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు ఇతర జిల్లా అధికారులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్ కు చేరుకున్న భట్టి జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కేవీ ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక,

-మిగతా 2లో





## షేక్ హసీనా ఢాకాకు తిరిగి వస్తే జైలుకే

- షేక్ హసీనా ఢాకాకు తిరిగి రావడంపై స్పందించిన బంగ్లాదేశ్ మంత్రి
- స్వదేశానికి తిరిగొస్తే చట్టప్రకారమే చర్యలు తీసుకుంటాం
- హసీనాపై న్యాయ ప్రక్రియ కొనసాగుతుందన్న ఢాకా
- అవామీ లీగ్‌కు ధైర్యం చెప్పేందుకే హసీనా వ్యాఖ్యలు?
- అప్పగింత కోసం భారత్‌కు మరోసారి ఢాకా విజ్ఞప్తి

ఢాకా:

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఢాకాకు తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఆమె తిరిగి రావడంపై బంగ్లాదేశ్ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. షేక్ హసీనా తిరిగి బంగ్లాదేశ్ కు వస్తే చట్ట ప్రకారం అరెస్ట్ చేసి జైలుకు పంపుతామని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి శామా ఒబైద్ ఇస్లాం స్పష్టం చేశారు. హసీనా ఎక్కడ లొంగిపోయినా, బంగ్లాదేశ్ లో అడుగుపెట్టిన వెంటనే చట్టపరమైన ప్రక్రియ అమలవుతుందని పేర్కొన్నారు. హసీనా లొంగిపోతే ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల ప్రకారమే చర్యలు తీసుకుంటామని శామా ఒబైద్ తెలిపారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని అన్నారు. ఆమె ఇప్పటికే కోర్టుల్లో దోషిగా తేలిన వ్యక్తి, అందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించాల్సిన అవసరమే లేదన్నారు. భారత్ లో లేదా బంగ్లాదేశ్ లో లొంగిపోయినా ముందుగా జైలుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. హసీనా బంగ్లాదేశ్ కు తిరిగి వచ్చిన తర్వాత చట్టపరమైన ప్రక్రియ ఏ విధంగా ముందుకు సాగాలనే అంశాన్ని న్యాయవ్యవస్థే నిర్ణయిస్తుందని మంత్రి చెప్పారు.

-మిగతా 2లో



## 20న క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

- దశలవారీగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబాటు
- తొలి దశలో నియోజకవర్గానికి 500--1,000 ఇళ్లు
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం
- పరిపాలన అనుమతులకు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్
- త్వరలో దరఖాస్తులు, అర్హతలు, మార్గదర్శకాల ప్రకటన
- స్థలాల గుర్తింపు పూర్తి.. డిజైన్లకు తుది మెరుగులు
- పట్టణ పేదల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్

గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లతో పెద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం, ఇప్పుడు అదే సంకల్పంతో క్యూర్ పరిధిలో మరో చారిత్రాత్మక అడుగు వేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో దశల వారీగా లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనున్నట్టు అన్నారు. ఇందుకు

-మిగతా 2 లో




## సీఎం టార్గెట్ సిద్దిపేట!

- ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు బలమైన నేతలకు బాధ్యతలు
- ఓ వైపు మైనంపల్లి.. మరోవైపు జగ్గారెడ్డి.. స్పెషల్ ఫోకస్
- వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్
- గజ్వేల్ స్థానంపై రేవంత్ నజర్... అక్కడి నుంచే పోటీ చేయాలన్న యోచన
- బీఆర్ఎస్ బలంగా ఉన్న జిల్లాలపై అధికార పార్టీ వ్యూహాత్మక ప్రణాళిక
- పార్టీల బలాబలాలపై జిల్లాల వారీగా అంతర్గత సర్వే

హైదరాబాద్,

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే అంతర్గత కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ప్రధాన ప్రతిపక్షంలో బలమైన నాయకుల స్థానాలకు ఎసరు పెట్టేలా ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపబోతున్నారు. ప్రస్తుతానికి రేవంత్ టార్గెట్ 'సిద్ధిపేట'గా నిర్ణయించుకుని ఆ మేరకు గ్రౌండ్ వర్క్ సిద్ధం చేస్తున్నారు. అందుకోసం ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరు బలమైన నేతలకు బాధ్యతలు అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం. ఓ వైపు మైనంపల్లి.. మరోవైపు జగ్గారెడ్డికి అక్కడి బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చాలాకాలం పాటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగానే కాకుండా దాదాపు రెండు దశాబ్దాల కాలంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్థానిక సుపరిచిత నేతగా మైనంపల్లి హనుమంతరావు రాజకీయాల్లో

-మిగతా 2 లో



## అమ్మాయిల పెండ్లి వయసు 21కి పెంపు?

- కేంద్రం మరోసారి కసరత్తు
- 2027 జనాభా లెక్కల తర్వాతే తుది నిర్ణయానికి అవకాశం
- 23.1 ఏళ్లకు పెరిగిన మహిళల సగటు వివాహ వయసు
- పట్టణాల్లో 24.4.. గ్రామీణ ప్రాంతాల్లో 22.6 ఏళ్లకు పెళ్లిళ్లు
- ఉన్నత విద్య, ఉపాధితో ఆలస్యమవుతున్న వివాహాలు
- ఆలస్య వివాహాలతో తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు
- తల్లి ఆరోగ్యం, జనాభా, ఉపాధి విధానాలపై కొత్త ఆలోచనలు

2 లో

## అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయాలను
# నిర్మించండి

### ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ సదుపాయాలు కల్పించాలి

- కాకతీయ వైభవాన్ని ప్రతిబింబించేలా వరంగల్ ఎయిర్‌పోర్టు
- 2028 జూన్ 2 నాటికి పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి
- రెండు విమానాశ్రయాల్లో విమాన శిక్షణ కేంద్రాలకు ప్రతిపాదన
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు భూసేకరణ చేపడతాం: సీఎం
- హుస్సేన్‌సాగర్--ప్రకాశం బ్యారేజీ మధ్య సీ ప్లేన్‌ల ప్రతిపాదన
- అభివృద్ధికి రాజకీయాలకు సంబంధం లేదు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా ఈ రెండు విమానాశ్రయాలకు ఉన్న సానుకూల అవకాశాలు, పరిస్థితులను సీఎం వివరించారు. మంగళవారం ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయంలో రాజీవ్ గాంధీ భవన్‌లో రామ్మోహన్ నాయుడుతో సీఎం.రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా

-మిగతా 2 లో






## పీవోకేలో రక్తసిక్తం..

- పాక్ రేంజర్ల కాల్పుల్లో 8 మంది నిరసనకారుల మృతి
- తీవ్రంగా ఖండించిన భారత్
- ముజఫరాబాద్ ర్యాలీకి ముందు రావల్‌కోట్‌లో కాల్పుల కలకలం
- మహిళలు, ఆందోళనకారులపై భద్రతా బలగాల దాడి
- పీవోకేలో మానవ హక్కుల ఉల్లంఘనలపై భారత్ ఆగ్రహం
- దశాబ్దాలుగా అణచివేతకు పాల్పడుతోందని ఇస్లామాబాద్‌పై ఆరోపణ

2 లో

## 60 రోజులపాటు యుద్ధం?

- కాంగ్రెస్‌కు ట్రంప్ అధికారిక నోటీసు



2 లో




## వాణిజ్య నౌకలపై దాడులు ఆపాలి

- హోర్ముజ్ లో దాడులపై భారత్ సీరియస్
- పశ్చిమాసియాలో మళ్లీ ముదురుతున్న యుద్ధం
- హోర్ముజ్ లో ప్రయాణిస్తున్న యూఏఈకి చెందిన రెండు నౌకలపై ఇరాన్ దాడి
- ఈ ఘటనలో ఒక భారతీయ నావికుడు మరణం

న్యూఢిల్లీ

హోర్ముజ్ జలసంధి వంటి అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో వాణిజ్య నౌకల రాకపోకలకు ఆటంకం కలిగించడాన్ని, అందులోని సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ జరిపిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన దాడులపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి చెందిన డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ (డీసీఎం) మహమ్మద్ జావాద్ హొస్సేనీను భారత విదేశాంగ శాఖ పిలిపించిన వెంటనే ఈ అధికారిక ప్రకటన వెలువడింది.

-మిగతా 2 లో




## పాఠశాలలు, కళాశాలల్లో
# లైంగిక విద్యకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- సుప్రీంకోర్టుకు ప్రభుత్వ నిర్ణయం వెల్లడి
- 'సేఫ్ టచ్--అన్‌సేఫ్ టచ్'పై చిన్నారులకు అవగాహన
- పాఠ్యాంశాల్లో లైంగిక ఆరోగ్యం, భద్రతకు చోటు
- జాతీయ నిపుణుల కమిటీ కీలక సిఫార్సులకు ఆమోదం
- పోక్సో కేసుల నేపథ్యంలో సంస్కరణలపై దృష్టి
- వయస్సుకు తగిన లైంగిక విద్య బోధనకు కార్యాచరణ

న్యూఢిల్లీ,

దేశంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో 'సమగ్ర లైంగిక విద్య' ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించిందని, కోర్టు అనుమతి లభించిన వెంటనే అమలు ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్రం వెల్లడించింది. జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ముందు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ఈ విషయాన్ని వెల్లడించారు. కమిటీ సమర్పించిన నివేదికను ప్రభుత్వం అంగీకరించిందని, దేశవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

-మిగతా 2 లో

# అమ్మాయిల పెండ్లి వయసు 21కి పెంపు?

- కేంద్రం మరోసారి కసరత్తు
- 2027 జనాభా లెక్కల తర్వాతే తుది నిర్ణయానికి అవకాశం
- 23.1 ఏళ్లకు పెరిగిన మహిళల సగటు వివాహ వయసు
- పట్టణాల్లో 24.4.. గ్రామీణ ప్రాంతాల్లో 22.6 ఏళ్లకు పెళ్లిళ్లు
- ఉన్నత విద్య, ఉపాధితో ఆలస్యమవుతున్న వివాహాలు
- ఆలస్య వివాహాలతో తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు
- తల్లి ఆరోగ్యం, జనాభా, ఉపాధి విధానాలపై కొత్త ఆలోచనలు



న్యూఢిల్లీ,
భారతదేశంలో మహిళల సగటు వివాహ వయసు 19.3 ఏండ్ల నుండి 23.1 ఏండ్లకు పెరిగిందని శాంపిల్ రిజిస్ట్రేషన్ సర్వే(ఎస్ఆర్ఎస్), నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే(ఎస్ఎఫ్‌హెచ్ఎస్) నివేదిక పేర్కొంది. ప్రస్తుతం మహిలలు సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో సగటున 24.4 ఏండ్ల వయసులో, గ్రామీణ ప్రాంతాల్లో 22.6 ఏండ్ల వయసులో వివాహం చేసుకుంటున్నారని నివేదిక తెలిపింది. మహిళల చట్టపరమైన వివాహ వయసును 21 ఏండ్లకు పెంచేందుకు ప్రభుత్వం 2021లో ఒక బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అయితే లోక్‌సభ రద్దు కావడంతో దానికి కాలదోషం పట్టింది. ఇప్పుడు ఈ విషయమై 2027 జనాభా లెక్కల తర్వాత తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. మహిళల వివాహ వయసు పెరగడానికి వెనుక ఉన్న కారణాలు జనగణన ద్వారా అంచనా వేయడానికి వీలు ఏర్పడుతుంది. ఉన్నత విద్యా వివాహాన్ని ఆలస్యం చేస్తోందా, ఆలస్య వివాహం సంతానోత్పత్తిని తగ్గిస్తోందా, ఇంటి ఖర్చులు, నిరుద్యోగం, వలసలు వంటివి దోహదపడుతున్నాయా వంటి విషయాలపై అధ్యయనం చేయడం వల్ల మహిళల వివాహం జాప్యానికి కారణాలు తెలిసే అవకాశం ఉంది. ఆలస్యంగా వివాహం చేసుకోవడం, జనన రేట్లు తగ్గడం వంటి తూర్పు ఆసియా తరహా ధోరణులను భారత్ ఇప్పుడు చూస్తోంది. జనాభా, విద్య, తల్లి ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలలో విధానపరమైన మార్పులు అవసరం.

**పెండ్లికి, సంతానోత్పత్తికి సంబంధం?**

భారతదేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు(టీఎఫ్ఆర్) 1.9కి తగ్గింది. ఇందులోపట్టణ ప్రాంతాల్లో 1.5గా. గ్రామీణ ప్రాంతాల్లో 2.1గా ఉంది. మహిళలు ఆలస్యంగా వివాహం చేసుకోవడం వల్ల వారి సంతానోత్పత్తి కాలం తగ్గి తద్వారా జనన రేట్లు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. దేశంలో 10-14 సంవత్సరాల వయసు ఉన్న పిల్లల జనాభా 24 శాతం తగ్గింది. పనిచేయగల వయసు గల జనాభా 66.4 శాతానికి పెరిగింది. ప్రస్తుతం 6. ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారు జనాభాలో 9.7 శాతం మందిగా ఉన్నారు.

# 60 రోజులపాటు యుద్ధం?

## కాంగ్రెస్‌కు ట్రంప్ అధికారిక నోటీసు



వాషింగ్టన్,
ఇరాన్‌పై జూలై 7న మళ్లీ యుద్ధం ప్రారంభమైనట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికన్ కాంగ్రెస్‌కు ఒక అధికారిక నోటిఫికేషన్ పంపించారు. కాంగ్రెస్ ఆమోదం లేకుండానే ఆ ప్రాంతంలో సైన్యాన్ని వినియోగించడానికి 60 రోజుల పాటు కొత్త అవకాశాన్ని పొందడమే ఈ లేఖ ఉద్దేశంగా కనిపిస్తోంది. అమెరికన్లను, అలాగే అమెరికా జాతీయ భద్రత, విదేశాంగ విధాన ప్రయోజనాలను రక్షించాల్సిన నా బాధ్యతకు అనుగుణంగానే నేను ఈ సైనిక చర్యను చేపట్టాను అని ఆ లేఖలో ట్రంప్ పేర్కొన్నారు. ఏప్రిల్ 7న తాను జారీచేసిన రెండు వారాల కాల్పుల విరమణ, దాన్ని పొడిగించడం, యుద్ధానికి ఒక దౌత్యపరమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు తన ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆ లేఖలో ట్రంప్ పేర్కొన్నారు. జూన్ 17న ఇరాన్‌తో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ హొర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడి చేయడం ద్వారా ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ట్రంప్ పేర్కొన్నారు. దీంతో ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించక తప్పలేదని ఆయన తెలిపారు. ఘర్షణ తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో గల్ఫ్‌లో ఇరాన్ నౌకా రవాణాపై అమెరికా తన దిగ్బంధనాన్ని పునరుద్ధరిస్తోందని, అలాగే హొర్ముజ్ జలసంధి తెరిచి ఉండేలా చూస్తుందని ట్రంప్ తన లేఖలో పేర్కొన్నారు. యుద్ధాన్ని ప్రకటించే అధికారం కేవలం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని, అధ్యక్షుడికి కాదని అమెరికా రాజ్యాంగం పేర్కొంటోంది. అయితే అమెరికా భద్రతను కాపాడేందుకు చట్టసభల ఆమోదం లేకుండానే స్వల్పకాలిక సైనిక చర్యలను చేపట్టే అధికారం తమకు ఉందని అమెరికా అధ్యక్షులు చాలా కాలంగా వాదిస్తూ వస్తున్నారు.

# పీవోకేలో రక్తసిక్తం..

-పాక్ రేంజర్ల కాల్పుల్లో 8 మంది నిరసనకారుల మృతి
-తీవ్రంగా ఖండించిన భారత్
-ముజఫరాబాద్ ర్యాలీకి ముందు రావల్‌కోట్‌లో కాల్పుల కలకలం
-మహిళలు, ఆందోళనకారులపై భద్రతా బలగాల దాడి
-పీవోకేలో మానవ హక్కుల ఉల్లంఘనలపై భారత్ ఆగ్రహం
-దశాబ్దాలుగా అణచివేతకు పాల్పడుతోందని ఇస్లామాబాద్‌పై ఆరోపణ



ముజఫరాబాద్,
పాకిస్థాన్ రేంజర్స్ జరిపిన కాల్పుల్లో 8 మంది నిరసనకారులు మృతి చెందడంతో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో సోమవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు ఈ ప్రాంత రాజధాని ముజఫరాబాద్‌కు ఈ నెల 15న భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రావల్‌కోట్ బస్ స్టాండ్‌లో పెద్దయెత్తున గుమిగూడిన మహిళలు, ఆందోళనకారులను లక్ష్యంగా చేసుకుని పాక్ భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. పాక్ రేంజర్లు వారిపై టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించడంతో పాటు కాల్పులు కూడా జరిపారు. కాగా, ఈ ఘటన జరగడానికి ఒక రోజు ముందు అమెరికాలో నివసిస్తున్న పీవోకే ప్రవాసీయులు వాషింగ్టన్‌లోని శ్వేత సౌధం ముందు నిరసన తెలిపారు.తమ ప్రాంతంలో రోజురోజుకు తీవ్రమవుతున్న మానవతా సంక్షోభంలో అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని వారు కోరారు. సుమారు వంద మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో పీవోకేలోని పౌర నివాస ప్రాంతాల్లో మోహరించి ఉన్న పాకిస్థాన్ బలగాలను వెంటనే ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో కొనసాగుతున్న నిరసనలపై మంగళవారం పాక్‌ను భారత్ తీవ్రంగా విమర్శించింది. ఆ ప్రాంతంలో దశాబ్దాలుగా ఇస్లామాబాద్ వ్యవస్థాగత దోపిడీకి, ప్రాథమిక హక్కుల నిరాకరణకు, పరిపాలనా అణచివేతకు పాల్పడుతున్నదని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో ఆరోపించింది.

**పీవోకే మంగ్లా డ్యామ్‌లో ఉగ్రవాదులకు శిక్షణ**

పాక్ ఆక్రమిత జమ్ము కశ్మీరు(పీవోకే)లోని మంగ్లా డ్యామ్‌లో ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా ఉగ్రవాదులు జలమార్గం ద్వారా చేపట్టే కార్యకలాపాల కోసం శిక్షణ పొందుతున్న దృశ్యాలతో కూడిన ఒక కొత్త వీడియో వెలుగులోకి వచ్చింది. లష్కరేకి చెందిన సభ్యులు ఈత కొడుతున్నట్లు, నీటికి సంబంధించిన శిక్షణ పొందుతున్నట్లు ఆ వీడియోలో కనిపించింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన నేపథ్యంలో ఉగ్రవాదిగా అమెరికా గుర్తించిన హారిస్ దార్ కొత్తగా ఉగ్రవాద సభ్యులుగా చేరిన వారితో మాట్లాడుతూ ఈ ఏడాది ఏదో ఒక పెద్ద సంఘటన జరగబోతోంది అన్నట్లుగా ఉన్న ఒక వీడియో గతవారం బయటకు వచ్చింది.

# వాణిజ్య నౌకలపై దాడులు ఆపాలి

మొదటి తరువాయి

కాగా, ఒమన్ తీరంలో ప్రయాణిస్తున్న యూఏఈకి చెందిన రెండు చమురు ట్యాంకర్లపై ఇరాన్ క్షిపణులతో దాడి చేయగా, ఈ ఘటనలో ఒక భారతీయ నావికుడు మృతి చెందాడు. పలువురు గాయపడ్డారు. అనంతరం భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది.
సముద్ర మార్గాల్లో దాడులు పునర్ ప్రారంభం కావడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో ప్రశాంతత, భద్రత, స్థిరత్వాన్ని కాపాడేందుకు శత్రుత్వాలకు తక్షణమే ముగింపు పలకాలని పిలుపునిచ్చింది. అలాగే శాంతి కోసం చర్చలు, దౌత్యపరమైన సంప్రదింపులు జరపాలని కోరింది. అంతర్జాతీయ చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ప్రపంచ నౌకాయన మార్గాల్లో అడ్డంకులు లేని రాకపోకలు, సముద్ర వాణిజ్యాన్ని త్వరగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది. పశ్చిమాసియాలోని వాణిజ్య నౌకలు, సైనికేతర కేంద్రాలపై దాడులు ఆగిపోవాలని పేర్కొంది.

**'క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం'**

ఒమన్ తీరంలో అల్ బాహియా, మొంబాసా అనే పేరు గల రెండు నౌకలపై జరిగిన దాడుల పట్ల భారత్ తీవ్ర ఆందోళన చెందుతోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఈ రెండు నౌకల్లో మొత్తం 46 మంది సిబ్బంది ఉండగా, వారిలో 30 మంది భారతీయులేనని తెలిపారు. అల్ బాహియాలో పనిచేస్తున్న 12 మంది భారతీయులలో ఒకరు మరణించారని, మరొకరు గాయపడ్డారని పేర్కొన్నారు. మొంబాసాలో ఉన్న 18 మంది భారతీయుల్లో 9 మంది సిబ్బంది గాయపడ్డారని, వీరిలో ఇద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉందని వెల్లడించారు. అలాగే మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.
"బాధిత భారతీయ నావికులకు అవసరమైన సహాయం అందేలా చూసేందుకు యూఏఈలోని ఇండియన్ ఎంబసీ, కాన్సులేట్ అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాయి. యూఏఈ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన క్షిపణి దాడిలో ఒక భారతీయ నావికుడు మరణించాడు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై తీవ్ర నిరసన తెలియజేయడానికి మంగళవారం ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ ను భారత్ పిలిపించింది. పశ్చిమాసియాలో జరుగుతున్న అన్ని పరిణామాలను మేము నిశితంగా గమనిస్తున్నాం. హోర్ముజ్ జలసంధి గుండా సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన నౌకాయనానికి, వాణిజ్యానికి మద్దతుగా మేము మా వైఖరిని స్థిరంగా కొనసాగిస్తున్నాం. ఎందుకంటే హోర్ముజ్ నౌకాయనం భారత్ కే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఆర్థిక, ఇంధన భద్రతను కల్పించడంలో సహాయపడుతుంది" అని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

# సీఎం టార్గెట్ సిద్దిపేట!

మొదటి తరువాయి

కొనసాగుతున్నారు. కొడుకును మెదక్ ఎమ్మెల్యేగా గెలిపించుకుని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోనే ఆయన తనదైన ముద్ర వేసుకున్నారు. మరోవైపు రెండున్నర దశాబ్దాల కాలంగా జిల్లా రాజకీయాలపై పూర్తి జయప్రకాశ్ రెడ్డికి సంపూర్ణ అవగాహన, నాయకులతో మంచి పరిచయాలు ఉన్నాయి. ఆ ఇద్దరూ హరీష్‌రావుకు రాజకీయంగా బద్ధ శత్రువులే కావడం విశేషం. హరీష్‌ను ఎలాగైనా ఓడించి తీరాలన్న గట్టి పట్టుదలతో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కసితో పనిచేసి విజయం సాధించేలా ఇద్దరు నేతలకు బాధ్యతలు అప్పగించడం పట్ల సర్వత్రా చర్చ జరుగుతోంది. తెలంగాణాలో 2034 వరకూ కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని వందల సందర్భాల్లో ప్రకటిస్తూ వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆ దిశగా అంతర్గత కార్యాచరణ, ప్రత్యేక వ్యూహం కలిగి ఉన్నట్లు తాజా పరిణామాలను బట్టి స్పష్టమవుతోంది. దీనికి అనుగుణంగా వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించి కాంగ్రెస్ అధిష్టానానికి తన రాజకీయ వ్యూహాత్మక కార్యాచరణను కూడా సమర్పించారు. ఇక మాజీ సీఎం కేసీఆర్ స్థానం గజ్వేల్ అసెంబ్లీ సెగ్మెంట్‌పై రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో మాదిరిగా రెండో స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించుకుని కొడంగల్‌తో పాటు గజ్వేల్‌లో కూడా పోటీకి సిద్ధమవుతున్నారు. తన పోటీ ఉద్దేశాన్ని ఇప్పటికే అనేక సంకేతాలిస్తూ.. అక్కడి నుండి పోటీ చేయాలన్న యోచనలో ఉన్నట్లు ఆయన అనుచరవర్గ నేతలు స్పష్టం చేస్తున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ బలంగా ఉన్న జిల్లాలపై అధికార పార్టీ వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. పార్టీల బలాబలాలపై జిల్లాల వారీగా అంతర్గత సర్వే నిర్వహిస్తోంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని కీలక సెగ్మెంట్లపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక వ్యూహంతో ఉన్నట్లు అంతర్గత కార్యాచరణను బట్టి స్పష్టమవుతోంది.
వచ్చే ఎన్నికల్లో ఏకంగా 117 స్థానాల్లో విజయం సాధిస్తామంటూ ఘంటాపథంగా చెప్పడం వెనుక ఆయన కార్యాచరణ ఈ క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న దూకుడు నిర్ణయాలు, భవిష్యత్తు వ్యూహాలకు పార్టీ శ్రేణుల నుంచి పూర్తి మద్దతు లభిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

**ఓవైపు జగ్గారెడ్డి... మరోవైపు మైనంపల్లి...**

సిద్దిపేటపై కాంగ్రెస్ పార్టీ ఫుల్ ఫోకస్ పెట్టి బ్యాక్‌గ్రౌండ్ వర్క్ చేస్తోంది. అక్కడ బలమైన నేతగా ఉన్న హరీష్ రావును పడగొట్టాలన్న ఉద్దేశ్యంతో ఇప్పటి నుంచే వ్యూహ రచన మొదలుపెట్టింది. సరైన నాయకుడి కోసం వెతుకులాట ప్రారంభించింది. సిద్దిపేటలో గెలిచే నాయకుడిని మంత్రిని చేస్తాం అని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిజానికి సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీకి సరైన నిర్మాణం, నాయకత్వం లేదు. ప్రతిసారి అక్కడ కాంగ్రెస్ డిపాజిట్ కోసం మాత్రమే పోటీ పడాల్సి వచ్చేది. కొన్నాళ్లుగా అక్కడ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లితో ఫోకస్ చేయించారు. నిజానికి హరీష్‌తో ఉన్న వైరం వల్లే గతంలో తానే సిద్దిపేట సంగతి చూస్తానంటూ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హడావుడి చేసినా, ఆ తర్వాత మైనంపల్లి వచ్చి సిద్దిపేట కాంగ్రెస్‌కు పెద్దదిక్కుగా మారారు. ఇప్పటికే తనకంటూ ఓ వర్గాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. కానీ సంగారెడ్డిలో పోటీచేసిన జగ్గారెడ్డి స్వయంగా రాహుల్ గాంధీ వచ్చినా గెలవలేకపోవడంతో... ఇక తాను అక్కడి నుంచి పోటీచేయనని, తన భార్య నిర్మలా జగ్గారెడ్డి పోటీ చేస్తారని ప్రకటించారు. అంతేకాకుండా సిద్దిపేటలో పోటీ చేసి, హరీష్ ను ఓడిస్తానంటూ తాజాగా ప్రకటించారు. ఇక్కడ గతంలో కేసీఆర్ తో అత్యంత సాన్నిహిత్యం ఉండి... ఆర్థికంగా బలంగా ఉన్న వంగా నాగిరెడ్డి కొడుకు వంగా రాధికార్ రెడ్డి ఇప్పటికే తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకుని హరీష్ రావుపై పోటీకి సై అంటున్నారు. భవిష్యత్‌లో రాధికార్ రెడ్డే కాంగ్రెస్ క్యాండిడేట్ అవుతారని, లోకల్ కావడం, బీఆర్ఎస్ అసంతృప్తి నాయకత్వంతో పాటు తమకు ఉన్న మంచి పేరుతో హరీష్‌పై పోటీ ఇస్తారన్న చర్చ కూడా సిద్దిపేటలో ఉంది. అయితే ఈ మూడు వర్గాలుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ, సిద్దిపేటను కైవసం చేసుకొనేలా హరీష్ రావును ఎలా ఢీ కొంటుందనేది ఉత్కంఠ.

**హైకమాండ్‌దే టికెట్లపై తుది నిర్ణయం**

పార్టీలో టికెట్ల కేటాయింపు అంశంపై కూడా జగ్గారెడ్డి క్లారిటీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ఎవరికి సీట్లు ఇవ్వాలనేది కేవలం ఒకరిద్దరి చేతుల్లో ఉండదని.. సీఎం, పీసీసీ చీఫ్, అలాగే రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ముగ్గురూ కలిసి సంయుక్తంగా నిర్ణయిస్తారని చెప్పారు. ప్రజాదరణ, పార్టీ పట్ల నిబద్ధత ఉన్నవారికే ప్రాధాన్యం ఉంటుందని పరోక్షంగా సూచించారు. ఇటీవల వస్తున్న రకరకాల పొలిటికల్ సర్వేలపై జగ్గారెడ్డి స్పందిస్తూ.. 'ఎవరికి నచ్చినట్లు వారు సర్వేలు చేసుకుంటారు, వాటిని చూసి పార్టీ నేతలు టెన్షన్ పడాల్సిన అవసరం లేదు' అని దీమా వ్యక్తం చేశారు. అయితే, ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేల పనితీరును సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం గమనిస్తున్నారని, ప్రజల్లో పట్టు కోల్పోకుండా ఉండటానికి పలువురు శాసనసభ్యులకు ఆయన వ్యక్తిగతంగా కీలక సూచనలు, సలహాలు ఇస్తున్నారని జగ్గారెడ్డి వెల్లడించారు. మొత్తానికి 117 సీట్ల మిషన్‌తో రేవంత్ రెడ్డి వేస్తున్న అడుగులు తెలంగాణ రాజకీయాలను ఏ మలుపు తిప్పుతాయో వేచి చూడాలి.

# అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయాలను నిర్మించండి

మొదటి తరువాయి

చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలతో వరంగల్ కీలక నగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి తెలియజేశారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంతోపాటు నల్లగొండ జిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని అన్నారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసిన కారణంగా వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్టు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని రామ్మోహన్ నాయుడును సీఎం కోరారు. రెండు ఎయిర్‌పోర్టులకు అవసరమైన భూమిని సేకరిస్తామని సీఎం చెప్పారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలను నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రెటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ కార్యదర్శి మురళీధర్ మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మెన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు: రేవంత్ రెడ్డి**

అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదనీ, రాజకీయాలను ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో భేటీ అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తుచేశారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకు సహకరిస్తున్నదనీ, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచారలోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని వివరించారు. అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాల్లో కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీకి వస్తున్నామని, దానిపైనా రాజకీయాలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు.

# పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

మొదటి తరువాయి

క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ప్రారంభించారు.అనంతరం మల్దకల్ మండలం కుర్తిరావులచెరువు గ్రామానికి మంత్రులు చేరుకున్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో మంత్రులను సన్మానించారు. ఈ సందర్భంగా గద్వాల నియోజకవర్గంలో కుర్తిరావులచెరువుతోపాటు ఆరగిద్ద, తుమ్మలచెరువు, సోంపురం, పరుమాల, తురుకోనిపల్లి, పెద్దపాడు, ఉలిగేపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాలను మంత్రులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. గట్టు మండలం రాయపురం వద్ద రూ.48 కోట్ల నిధులతో 132/33 కెవి విద్యుత్ ఉప కేంద్రం, గద్వాల మండలం గోనుపాడు గ్రామం వద్ద రూ.3.05 కోట్ల నిధులతో జిల్లా స్టోర్స్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ ఫార్మర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సీఎం రేవత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ లో వలసలను సంపూర్ణంగా రూపుమాపి అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేశామన్నారు. అధికారంలోకి రాగానే గృహజ్యోతి పథకంలో అర్హులైన ప్రతి ఇంటికీ నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ఏడాదికి రూ. 20 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు అందజేస్తున్నా మన్నారు. రాబోయే ఐదేండ్లలో రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందించడమే ధ్యేయంగా ముందు కెళ్తున్నామన్నారు. ఇటీవల రైతుల ఖాతాల్లో రూ. 9,000 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశామని తెలిపారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల ఉచిత బీమాను వర్తింప చేస్తున్నామన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందించడం, వడ్లకు రూ. 500 బోనస్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో రూ.10 లక్షల వైద్య సేవలు వంటి పథకాలు ప్రజాపాలనలోనే సాధ్యమన్నారు. ఎంపీ మల్లు రవి పుట్టిన రోజు సందర్భంగా అభిమానులతో కలిసి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మెన్ గట్టు తిమ్మప్ప, గొర్రెలు, మేకల అభివద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మెన్ హనుమంతు, మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ నాగరాజు, డీఈ రవి ప్రసాద్ పాల్గొన్నారు.

# షేక్ హసీనా ఢాకాకు తిరిగి వస్తే జైలుకే

మొదటి తరువాయి

రాజకీయ సంకేతాల కోసమేనా?
షేక్ హసీనాను తిరిగి తీసుకొచ్చే ప్రక్రియ తాత్కాలిక ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైందని, ప్రస్తుతం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్పీ) నేతృత్వంలోని ప్రభుత్వం కూడా అదే ప్రక్రియను కొనసాగిస్తోందని శామా ఒబైద్ తెలిపారు. విదేశాల్లో ఉంటూ తిరిగి వస్తానంటూ హసీనా చేస్తున్న ప్రకటనలు, అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన లేదా దేశం విడిచిన అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తల్లో ధైర్యం నింపే ప్రయత్నంగానే కనిపిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. లొంగిపోవడానికి బదులుగా పార్టీ శ్రేణులను ప్రోత్సహించడమే ఆమె వ్యాఖ్యల ఉద్దేశంగా తాను భావిస్తున్నానని తెలిపారు.

## పాఠశాలలు, కళాశాలల్లో


# లైంగిక విద్యకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

మొదటి తరువాయి

కమిటీ ఎందుకు ఏర్పాటయిందంటే..?
యువత మధ్య పరస్పర అంగీకారంతో ఏర్పడే సంబంధాలు, మైనర్ గర్భధారణలకు సంబంధించిన కేసులు పోక్సో (పోక్సో) చట్టం కింద క్రిమినల్ కేసులుగా మారకుండా నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అదనపు కార్యదర్శి నేతృత్వంలో 26 మంది సభ్యులతో కూడిన జాతీయ నిపుణుల కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి పరస్పర అంగీకారంతో లైంగిక సంబంధాలు కలిగే కౌమారదశ యువత గోప్యతా హక్కులు, పోక్సో చట్టం ప్రభావం వంటి అంశాలను అధ్యయనం చేసే బాధ్యత అప్పగించారు.
కమిటీ చేసిన కీలక సిఫార్సులు ఇవే..
టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్), క్లినికల్ సైకాలజిస్టులు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌పిసిఆర్), నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నాల్సా) ప్రతినిధులు సభ్యులుగా ఉన్న కమిటీ పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన పలు కీలక అంశాలు సూచించింది.

# 20న క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

మొదటి తరువాయి




సంబంధించి ఇప్పటికే పరిపాలన అనుమతులు సైతం ఇవ్వడం జరిగిందని వివరించారు. మంగళవారం సచివాలయంలోని తన చాంబర్‌లో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇండ్ల పై హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల పథకానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి పథకానికి సంబంధించిన విధివిధానాలు , దరఖాస్తుల ఆహ్వానం, అర్హతలు, టెండర్ల ప్రక్రియ, అమలు విధానం తదితర పూర్తి మార్గదర్శకాలను ప్రకటిస్తామని వివరించారు.2026-27 ఆర్థిక సంవత్సరంలో క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గానికి కనీసం 500 చొప్పున, ఆయా స్థానిక పరిస్థితులనుబట్టి అవసరమైన చోట వెయ్యి వరకు నిర్మిస్తామన్నారు. క్యూర్ పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ నియోజకవర్గాలల్లో స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ స్థలాలను ఇప్పటికే హౌసింగ్ విభాగం పొజిషన్ లోకి తీసుకుందనీ, ఎక్కడ ఎన్ని ఇండ్లు, ఎన్ని అంతస్తులు నిర్మించాలి, ఒక్కో ప్లాట్ విస్తీర్ణం, బిల్డింగ్ డిజైన్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి రెండు, మూడు రోజుల్లో తుది రూపును ఇస్తామని వెల్లడించారు.

# డబ్బులు డబుల్ అనే మాయ మాటలు నమ్మొద్దు

- సైబర్ మోసాలపై జిల్లా ప్రజలకు ఎస్పీ హెచ్చరిక
- సెంట్రల్ గవర్నమెంట్ పేరుతో వచ్చే నకిలీ పెట్టుబడి పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు.. ప్రజల అప్రమత్తతే మోసాల నివారణకు కీలకం
- జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్.



జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్.

**మిడ్జిల్, జూలై 14, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త పద్ధతులను అవలంబిస్తూ అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని భారీ మొత్తంలో డబ్బులు కాజేస్తున్నారని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలిపారు. ముఖ్యంగా "మీ డబ్బులు డబుల్ అవుతాయి", "సెంట్రల్ గవర్నమెంట్ గ్యారెంటీ", "100% సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్" వంటి ఆకర్షణీయమైన ప్రకటనలతో సైబర్ మోసగాళ్లు ప్రజలను వలలో వేసేందుకు ప్రయత్నిస్తున్నారని జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ తెలిపారు. ఇటువంటి ప్రకటనలను చూసి ఎలాంటి ధృవీకరణ లేకుండా డబ్బులు పెట్టుబడి పెట్టవద్దని ప్రజలకు సూచించారు. ఇటీవలి కాలంలో నకిలీ పెట్టుబడి పథకాలు, ప్రభుత్వ పేర్లతో నడిచే మోసాలు పెరుగుతున్నాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.జిల్లాలో సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు నిరంతరం సూచనలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా అనుమానాస్పద పెట్టుబడి లింకులు, సోషల్ మీడియా పోస్టులు లేదా ఫోన్ కాల్స్ ద్వారా డబ్బులు పెట్టమని కోరితే వెంటనే అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
ప్రజలు పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ నిజమైనదేనా, ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా అనే విషయాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని ఎస్పీ సూచించారు. అధిక లాభాలు, తక్కువ సమయంలో డబ్బులు రెట్టింపు అవుతాయని చెప్పే పథకాలు ఎక్కువగా మోసపూరితమైనవే కావచ్చని హెచ్చరించారు. అధికారిక ధృవీకరణ లేని లింకులను క్లిక్ చేయడం, వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు లేదా UPI PIN లను ఎవరికీ తెలియజేయకూడదన్నారు.
సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ప్రజలను కోరారు.

## వెంకట్రావుపేట్ సర్పంచ్ మహేష్‌కు వస్పుల జంగయ్య సన్మానం



**ఆమనగల్లు,జులై14(నేటి దర్శిని):**
తలకొండపల్లి మండలం వెంకట్రావుపేట్ గ్రామ సర్పంచిగా ఎన్నికైన ఇమ్మడి మహేష్ ని హైదరాబాద్ టెలికం బోర్డ్ డైరెక్టర్ వస్పుల జంగయ్య శాలువాలతో పూలమాలలతో సత్కరించి వారిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ యువత రాజకీయాలలో ఉన్నతంగా రాణించాలని సమాజంలో మార్పు కోసం పాటుపడాలని సూచించారు.దేశానికి పట్టుకొమ్మలు గ్రామాల అభివృద్ధి ఆదర్శవంతంగా ఉన్నతమైన విద్యావంతులు దేశంలో మేటిగా తీర్చిదిద్దేందుకు గొప్ప అవకాశమే సర్పంచ్ పదవి, ప్రథమ పౌరులుగా తీర్చిదిద్దే సువర్ణవకాశంతో సమాజ అభ్యున్నతికి పాటుపడాలని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో రామ్ చందర్,పురుషోత్తం, మైసయ్య,రాములు, శంకర్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఆపన్నహస్తం..

## నిరుపేద కుటుంబానికి స్వచ్ఛంద సేవకుడు జర్పుల భాస్కర్ నాయక్ అండ

- గొంతులో కాయిన్ ఇరుక్కొని ప్రాణాపాయంలో ఉన్న బాలుడికి సొంత ఖర్చుతో శస్త్రచికిత్స చేయించిన భాస్కర్...




స్వచ్ఛంద సేవకుడు జె.భాస్కర్ నాయక్



చికిత్స పొందుతున్న బాలుడు

**మిడ్జిల్, జులై 14, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో)**
ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని మరోసారి నిరూపించారు మిడ్జిల్ స్వచ్ఛంద సేవకుడు జరుపుల భాస్కర్ నాయక్.. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన వాటర్‌మ్యాన్ కురుమయ్య కుమారుడు గొంతులో అనుకోకుండా కాయిన్ ఇరుక్కోవడంతో తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలో విలవిలలాడాడు. ఈ విషయం తెలుసుకున్న భాస్కర్ వెంటనే స్పందించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి బాలుడిని అత్యవసరంగా హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు.వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి, సొంత ఖర్చుతో శస్త్రచికిత్స చేయించి బాలుడి ప్రాణాలను కాపాడేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సమయానికి చికిత్స అందడంతో బాలుడు ప్రమాదం నుంచి బయటపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావడంతో చికిత్స ఖర్చుల గురించి ఆలోచించకుండా భాస్కర్ అన్న ముందుకొచ్చి అన్ని బాధ్యతలు తీసుకోవడం గ్రామస్థుల ప్రశంసలు అందుకుంది. "ఆపద అంటే ఏ అర్ధరాత్రి అయినా ఆయన ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి" అని గ్రామస్థులు కొనియాడుతున్నారు.ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో భాస్కర్ ఎప్పుడూ ముందుంటారని, సేవా భావంతో ప్రజలకు అండగా నిలుస్తూ ఎంతోమందికి భరోసాగా మారారని స్థానికులు పేర్కొన్నారు. భాస్కర్ చేసిన ఈ మానవతా సహాయానికి బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ బిడ్డకు కొత్త జీవితం ప్రసాదించారని భావోద్వేగానికి గురయ్యారు.

## "లైట్ ఎట్"పేరిట ఆమనగల్లు చిత్రకారులు హైదరాబాదులో సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్





చిత్రకారుడు ఎంగలి రాఘవేందర్

**ఆమనగల్లు,జులై14(నేటి దర్శిని);**
ఆమనగల్లు కు చెందిన సమకాలీన చిత్రకారుడు ఎంగలి రాఘవేందర్ తన తాజా సోలో ఆర్ట్స్ ఎగ్జిబిషన్"లైట్ ఎట్"ను జులై 16 నుండి 19 వరకు చిత్రమయి స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్,గ్యాలరీ నెం3..4, మాదాపూర్ హైదరాబాదులో నిర్వహించనున్నారని రాఘవేందర్ తెలిపారు. ఇందులో ఆమనగల్లు కు చెందిన ప్రముఖ చిత్రకారులు అందరూ కలిసి లైట్ ఎట్ అనే సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్ ను నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రీవ్యూ కార్యక్రమం జులై16 సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఎంగలి రాఘవేందర్ కళా ప్రయాణం తన చిన్ననాటి అనుభవాలు, కుటుంబంలోని చేనేత సాంప్రదాయం వస్త్రాలకు రంగులు అద్దె ప్రక్రియ నుంచి ప్రేరణ పొందింది అని,రంగుల ప్రకాశం,వెలుగుల అందం ఆయనలో కళపట్ల ఆసక్తిని పెంపొందించాలని అన్నారు. వ్యక్తిగత అనుభవాలు, మారుతున్న సామాజిక... సాంస్కృతిక పరిస్థితులు, ప్రకృతి,పట్టణ జీవనం, సమకాలీన యువత ఆలోచన విధానం వంటి అంశాలు ఈ చిత్రాల్లో విభిన్న రూపాల్లో ప్రతిబింబిస్తాయని ఆయన అన్నారు.ప్రకాశవంతమైన రంగులు,బలమైన రూపకల్పన,బహుళ స్థాయిల భావవ్యక్తీకరణ ద్వారా ప్రతి చిత్రం ప్రేక్షకుడిని ఆలోచింపజేసేలా రూపించబడిందని రాఘవేందర్ అన్నారు. కళాభిమానులు, విద్యార్థులు,కళాకారులు, పరిశోధకులు,మరియు ప్రజలందరూ ఈ ప్రదర్శనను సందర్శించాలని, కళానుభూతిని ఆస్వాదించాలని ఆమనగల్లు కు చెందిన ప్రముఖ చిత్రకారులు అందరూ కలిసి ఆహ్వానిస్తున్నామని నిర్వాహకులు అన్నారు.

# 55 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

- ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు జులై 14 (నేటి దర్శిని)**
సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, రక్షిత మంచినీటి సరఫరా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.అమీన్పూర్ డివిజన్‌లోని టైలర్స్ కాలనీలో జలమండలి ఆధ్వర్యంలో రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యేలా మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేయడానికి నూతన పైపులైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయిన అనంతరం టైలర్స్ కాలనీ ప్రజలు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి అన్ని మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ప్రతి కాలనీని ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసి సుధాకర్ రెడ్డి, జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం శివ, ఏఈ శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, జగదీష్, గోపాల్, రాములు, చంద్రశేఖర్, రాజు, బాలరాజు, స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిల్వేర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన

- అదనపు కలెక్టర్
- ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం



**మిడ్జిల్, జూలై 14 (నేటి దర్శిని బ్యూరో ):**
మిడ్జిల్ మండలం చిల్వేర్ గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల దరఖాస్తుల పరిశీలనతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవేందర్ రెడ్డి ఎస్ఐఆర్ పురోగతిని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు గౌడ్, మార్కెట్ డైరెక్టర్ సత్యం గౌడ్, ఉప సర్పంచ్ మోహన్ గుప్తా, పంచాయతీ కార్యదర్శి ఖలీల్, గ్రామ బీఎల్ఓలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారత రైతాంగానికి తీపికబురు..

**-పారాక్వాట్‌ను నిషేధించిన ప్రభుత్వం..!**



**న్యూఢిల్లీ: జూలై 14 (నేటి దర్శిని)**
భారత రైతాంగం పాలిట విషతుల్యంగా మారిన పారాక్వాట్ గడ్డిమందుపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఎందరో రైతుల ప్రాణాలను బలిగొన్న ఈ హానికరమైన రసాయనం అమ్మకాలు నిలిపివేస్తూ మంగళవారం వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. ఇప్పటికే 70కి పైగా దేశాల్లో పారాక్వాట్‌ను నిషేధించగా మనదేశంలో మాత్రం ఈ గడ్డిమందు అమ్మకాలు యథేచ్ఛగా సాగాయి. అయితే.. ఇటీవల కాలంలో ఈ రసాయనం దుష్పరిణామాలపై తీవ్ర స్థాయిలో ఆందోళనలు.. వైద్యులు, వ్యవసాయ నిపుణుల అభ్యర్థించడంతో దిగొచ్చిన కేంద్రం ఎట్టకేలకు పారాక్వాట్‌ను నిషేధం విధించింది.ప్రాణాంతకమైన పారాక్వాట్(పారక్వాట్ డైక్లోరైడ్)పై కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిషేధం విధించింది. హానికరమైన ఈ గడ్డిమందు అమ్మకాలను నిలిపివేస్తున్నట్టు మంగళవారం వ్యవసాయ మంత్రిత్వ శాఖ పేర్కొంది. పారాక్వాట్ వినియోగంపై ఈ రోజు నుంచే (జూలై 14) దేశ వ్యాప్తంగా నిషేధం అమలులోకి వస్తుందని కేంద్రం వెల్లడించింది. కీటకనాశన చట్టం 1968, సెక్షన్ 27 ప్రకారం పారాక్వాట్ దిగుమతి, తయారీ, రవాణా, పంపిణీపై పూర్తి స్థాయిలో నిషేధం వర్తిస్తుందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. అదే సమయంలో.. సదరు కంపెనీకి అభ్యంతరాలు, సూచనలు తెలియజేయడానికి 30 రోజుల సమయం ఇచ్చింది. జూలై 13 నుంచి ఆగస్టు 13లోపు పారాక్వాట్ ఉత్పత్తి సంస్థ తమ స్పందన తెలియజేయాల్సి ఉంది.

**6 వేలమందికి పైగా**
గడ్డి మందుగా వాడకంలో ఉన్న పారాక్వాట్ ప్రాణాలు బలిగొంటుందని పలువురు కేంద్రానికి ఫిర్యాదు చేశారు. ఈ గడ్డిమందు కారణంగా దేశవ్యాప్తంగా 6 వేలమందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయారని రికార్డులు చెబుతున్నాయి. టాలీవుడ్ కమెడియన్ రాహుల్ రామకృష్ణ ఈ మందు కారణంగానే తన సోదరుడు ప్రాణాలు కోల్పోయాడని, తక్షణమే దీన్ని బ్యాన్ చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. అలానే.. ది మైఖేల్ జె.ఫాక్స్ ఫౌండేషన్ సైతం.. ఈ హానికర రసాయనానికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసింది. వీరితో పాటు వైద్యులు, వ్యవసాయ నిపుణులు సైతం నిషేధానికి పట్టుబట్టారు. దాంతో, పారాక్వాట్‌పై నిషేధానికి సంబంధించిన ఫైలుపై కేంద్ర వ్యవసాయ మంత్రి సంతకం చేశారని కిసాన్ టాక్ కథనం వెల్లడించింది.


# మూడు లక్షలకు చేరువలో అమర్‌నాథ్‌ను దర్శించుకున్న భక్తుల సంఖ్య..



**న్యూఢిల్లీ: జూలై 14 (నేటి దర్శిని)**
పవిత్ర అమర్‌నాథ్ యాత్ర అత్యంత భక్తి శ్రద్ధలతో విజయవంతంగా కొనసాగుతోంది. యాత్ర ప్రారంభమైన తొలి 11 రోజుల్లోనే దర్శించుకున్న భక్తుల సంఖ్య 2.75 లక్షలు దాటి మూడు లక్షలకు చేరువైంది. యాత్రికుల తాకిడి రోజురోజుకు క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో ఇవాళ అమర్‌నాథ్‌ను దర్శించుకున్న భక్తుల సంఖ్య మూడు లక్షలు దాటే అవకాశం ఉంది.మంగళవారం జమ్మూ నుంచి 5,335 మంది భక్తులతో కూడిన మరో బృందం కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్‌కు బయలుదేరింది. వీరిలో 3,599 మంది పహల్గామ్ బేస్ క్యాంపునకు, 1,736 మంది బల్తాల్ బేస్ క్యాంపునకు వెళ్తున్నారు. సోమవారం ఒక్కరోజే 24,259 మంది యాత్రికులు దర్శనం చేసుకున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కాగా ఈ యాత్రలో సోమవారం ఒక చిన్న రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. Accidents & Disasters రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ సమీపంలో యాత్రికుల బస్సు బ్రేకులు విఫలం కావడంతో మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో 18 మంది యాత్రికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారికి వెంటనే ప్రథమ చికిత్స అందించి, ప్రత్యామ్నాయ వాహనంలో ప్రయాణాన్ని కొనసాగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన మినహా యాత్ర ప్రశాంతంగా సాగుతోంది. జూలై 3న ప్రారంభమైన ఈ 57 రోజుల సుదీర్ఘ యాత్ర శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన్ పర్వదినమైన ఆగస్టు 28న ముగియనుంది. యాత్ర సురక్షితంగా సాగేందుకు సీఆర్పీఎఫ్, ఆర్మీ, స్థానిక పోలీసులతో సహా భద్రతా బలగాలు సమన్వయంతో పనిచేస్తూ పటిష్ఠమైన ఏర్పాట్లు చేశాయి.

# పగబట్టిన ఏనుగు దాడిలో నలుగురు దుర్మరణం..!

**పద్నాలుగేళ్ల క్రితం తల్లిదండ్రులు.. ఇప్పుడు కోడలు, మనవడు..**



**న్యూఢిల్లీ: జూలై 14 (నేటి దర్శిని)**
ఏనుగు పగబట్టి ఓ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. పగబట్టి వెంటాడింది. ఈ క్రమంలో 14 ఏళ్ల క్రితమే ఇద్దరిని చంపేసింది. దాంతో భయపడిన ఆ కుటుంబం ఊరి వదిలిపోయి వేరే ఊళ్లో మకాం పెట్టింది. అయినా ఆ కుటుంబాన్ని పసిగట్టి మరో ఇద్దరిని చంపేసింది. దాంతో ఆ ఏనుగు దాడిలో ఒకే కుటుంబానికి చెందిన నాలుగు ప్రాణాలు గాల్లో కలిసిపోయినట్లు అయ్యింది. ఈ హృదయవిదారక ఘటన నేపాల్ లో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. నేపాల్‌లోని చిత్వాన్ నేషనల్ పార్క్ సమీపంలో నివసించే శనిచర బోటే కుటుంబానికి 'ధ్రుబే' అనే ఏనుగు రూపంలో మృత్యువు వేటాడింది. 2012 డిసెంబర్‌లో మాడి అనే పట్టణంలో ధ్రుబే ఏనుగు దాడిచేసి శనిచర తల్లిదండ్రులు ప్రాణాలు కోల్పోయారు. ఈ భయంకరమైన ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన శనిచర.. తన కుటుంబాన్ని ఈ ప్రమాదం నుంచి కాపాడుకోవాలని నిర్ణయించుకున్నాడు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాప్తి నది దాటి దాదాపు 9 మైళ్ల దూరంలోని జగత్‌పూర్‌కు తన నివాసాన్ని మార్చాడు.రూ౩ి౩ఊ౦ఐవ౪౦ & ఊఐఙఖర౯వ౪౦ ఇక తమకు ఆ ఏనుగు నుంచి ఎలాంటి ప్రమాదం ఉండదని భావించాడు. అయితే విధి వారిని వెక్కిరించింది. 14 ఏళ్ల తర్వాత అదే ధ్రుబే ఏనుగు వాసనతో పసిగట్టి వారిని వెతుక్కుంటూ వచ్చింది. ఈ నెల ఆరంభంలో జగత్‌పూర్‌లోని శనిచర ఇంటిపై దాడిచేసి, అతని 25 ఏళ్ల కోడలు ఆషికా బోటేను, 4 ఏళ్ల మనవడు భరత్ బోటేను అతి కిరాతకంగా చంపేసింది. ఈ ఘటనతో శనిచర బోటే కుటుంబం విషాదంలో మునిగిపోయింది. 'నదులు దాటి ఇంత దూరం వస్తే మమ్మల్ని ఏమీ చేయలేదని అనుకున్నాం. కానీ ఇన్ని సంవత్సరాల తర్వాత అదే ఏనుగు మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి నా కోడలిని, మనవడిని బలిగొంది. ఇక పారిపోవడానికి చోటు కూడా లేదు' అంటూ ఆయన కన్నీరుమున్నీరయ్యారు. ధ్రుబే ఏనుగు నేపాల్‌లో అత్యంత ప్రమాదకరమైనదిగా పేరుగాంచింది. 2010 నుంచి ఇప్పటివరకు ఈ ఒక్క ఏనుగే 25 మందిని చంపినట్లు చిత్వాన్ నేషనల్ పార్క్ అధికారులు ధ్రువీకరించారు. "ఈ తాజా ఘటనకు ముందు ధ్రుబే 23 మందిని చంపినట్లు మా రికార్డుల్లో ఉంది. ఇప్పుడు జగత్‌పూర్‌లో ఇద్దరు మరణించడంతో ఆ సంఖ్య 25కు చేరింది" అని పార్క్ ప్రతినిధి అభినాష్ థాపా మగర్ తెలిపారు. ఈ ఏనుగు పేరు మీద వికీపీడియాలో ఒక పేజీ కూడా ఉండటం దాని భయానక చరిత్రకు నిదర్శనం. అటవీ అధికారులు ధ్రుబే కదలికలను పర్యవేక్షించడానికి 2016 నుంచి ప్రయత్నిస్తూనే ఉన్నారు. దానికి ట్రాకింగ్ కాలర్ కూడా అమర్చారు. 2020, 2023లో ఆ కాలర్‌ను మార్చినప్పటికీ, దానిని పూర్తిగా నియంత్రించడంలో విఫలమయ్యారు. అడవులు తగ్గిపోవడం, మానవ నివాసాలు విస్తరించడం వల్ల నేపాల్‌లో ఇలాంటి ఘర్షణలు పెరుగుతున్నాయని, ఈ విషాదం దాని తీవ్రతను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిందని నిపుణులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

# న్యాయస్థానానికే అబద్ధాలు చెబుతావా'


**కమెడియన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం**



**న్యూఢిల్లీ: జూలై 14 (నేటి దర్శిని)**
దివ్యాంగుల మనసు నొప్పించేలా జోకులు వేసిన ఘటనకు సంబంధించిన కేసులో కమెడియన్ సమయ్ రైనా తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అబద్ధాలు చెప్పి న్యాయవ్యవస్థను అవహేళన చేశావంటూ మండిపడింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకుగానూ రూ.3 లక్షల జరిమానా విధించింది. కమెడియన్ సమయ్ రైనా, యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా తోపాటు మరికొందరు కమెడియన్లు తమ అభ్యంతరకర వ్యాఖ్యలతో దివ్యాంగుల మనసు బాధించేలా జోకులు వేశారని ఎస్ఎంఏ క్యూర్ ఫౌండేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం.. దివ్యాంగులకు కావాల్సింది గౌరవ మర్యాదలని, వారి విజయాలను కమెడియన్లు తమ వేదికల్లో చాటిచెప్పాలని సూచించింది. ఈ షోలకు దివ్యాంగులను కూడా ఆహ్వానించి వాటితో వచ్చే నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. అయితే కోర్టు ఆదేశాల ప్రకారం.. సమయ్ రైనా తన షోలకు దివ్యాంగులను ఆహ్వానించలేదని ఎస్ఎంఏ క్యూర్ ఫౌండేషన్ ధర్మాసనానికి తెలిపింది. దాంతో న్యాయస్థానం కమెడియన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'సమయ్ రైనా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే గాక.. న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. దేశం వెలుపల ఉంటే తాము చట్టపరిధిలోకి రామని వారు భావిస్తున్నట్లున్నారు. ఇది పూర్తిగా అహంకారమే. ఇందుకు వారికి శిక్ష పడాల్సిందే' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహించింది. సమయ్ రైనాకు రూ.10 లక్షల జరిమానా విధించింది.అయితే ఆ తర్వాత కమెడియన్ తరఫు న్యాయవాదుల అభ్యర్థనతో జరిమానాను రూ.3 లక్షలకు తగ్గించింది. మరోసారి తప్పు చేస్తే ఈ మొత్తాన్ని రూ.30 లక్షలకు పెంచుతామని హెచ్చరించింది. జరిమానాను రెండు వారాల్లోగా సుప్రీంకోర్టుకు డిపాజిట్ చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

# సంపాదకీయం

## విద్యా సంస్కరణల పేరుతో రాష్ట్ర అధికారాల కేంద్రీకరణా?




భారతదేశంలో విద్య అనేది కేవలం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల నిర్వహణకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. అది దేశ ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం, శాస్త్ర సాంకేతిక ప్రగతి, ప్రజాస్వామ్య బలోపేతానికి పునాది. అందుకే భారత రాజ్యాంగం విద్యను కేంద్రం, రాష్ట్రాలు రెండూ చట్టాలు చేయగల ఉమ్మడి జాబితాలో చేర్చింది. దీని ఉద్దేశం దేశవ్యాప్తంగా నాణ్యతను కాపాడుతూనే, స్థానిక అవసరాలకు అనుగుణంగా రాష్ట్రాలు తమ విద్యా విధానాలను రూపొందించుకునే అవకాశాన్ని కల్పించడం. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ -2025 (విబిఎస్ఎ) బిల్లు ఈ సమతుల్యతను మార్చబోతుందా అనే ప్రశ్న దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఉన్నత విద్యలో సమూల సంస్కరణగా అభివర్ణిస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) , నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సిటిఇ) వంటి సంస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, దేశవ్యాప్తంగా ఒకే నాణ్యతా ప్రమాణాలు అమలు చేయాలనేది ప్రభుత్వ వాదన. అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం, నియంత్రణలో పారదర్శకత తీసుకు రావడం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భారత ఉన్నత విద్యను తీర్చిదిద్దడం ఈ బిల్లుకు ప్రధాన లక్ష్యాలని కేంద్రం చెబుతోంది.అయితే, ఈ బిల్లుపై వస్తున్న అభ్యంతరాలు కేవలం రాజకీయాలకే పరిమితం కావడం లేదు. ఆశ్చర్యకరంగా, బీజేపీ కూటమి ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాలు కూడా ఇందులోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. దీని అర్థం ఈ వివాదం రాజకీయ పార్టీల మధ్య పోరాటం కాదని, కేంద్ర--రాష్ట్ర అధికారాల సమతుల్యతకు సంబంధించినదని చెప్పవచ్చు. రాష్ట్రాల ప్రధాన ఆందోళన ఏమిటంటే, ఈ బిల్లు ద్వారా ఉన్నత విద్యపై ఉన్న కీలక అధికారాలు క్రమంగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాలు తమ విశ్వవిద్యాలయాల స్థాపన, విస్తరణ, కొత్త కోర్సులు, స్థానిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాలు రూపొందించే విషయంలో కీలక పాత్ర పోషించాయి. కొత్త వ్యవస్థలో నియంత్రణ, అక్రిడిటేషన్, నాణ్యతా ప్రమాణాలు, డిగ్రీల గుర్తింపు వంటి అంశాల్లో కేంద్ర సంస్థకే తుది అధికారం లభిస్తే, రాష్ట్రాల పాత్ర గణనీయంగా తగ్గిపోతుందని వారు భావిస్తున్నారు. భారతదేశం ఒకే సంస్కృతి, ఒకే భాష, ఒకే సామాజిక పరిస్థితులు కలిగిన దేశం కాదు. తెలంగాణలో అవసరమైన విద్యా విధానం, నాగాలాండ్‌లో అవసరమైనది ఒకటిగా ఉండదు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, సముద్ర ఆర్థిక వ్యవస్థకు అవసరమైన కోర్సులు ఉండవచ్చు. కర్నాటకలో సాంకేతిక రంగం అవసరాలు ఎక్కువగా ఉండవచ్చు. ఈ భిన్నత్వాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యా విధానాలను రూపొందించే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉండాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఒకే కేంద్ర ప్రమాణాన్ని దేశమంతటికీ వర్తింపజేయడం వల్ల ప్రాంతీయ అవసరాలు నిర్లక్ష్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇక్కడ మరో కీలక అంశం విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు ప్రభుత్వ ప్రత్యక్ష నియంత్రణలో కాకుండా అకాడమిక్ స్వేచ్ఛతో అభివృద్ధి చెందాయి. పరిశోధన, కొత్త కోర్సుల రూపకల్పన, స్థానిక అవసరాలకు అనుగుణంగా విద్యా కార్యక్రమాల రూపకల్పన వంటి అంశాల్లో విశ్వవిద్యాలయాలకు స్వతంత్ర నిర్ణయాధికారం ఉండటం అభివృద్ధికి దోహదపడింది. ఈ బిల్లులో కేంద్ర నియంత్రణ అధికమైతే, ఆ స్వేచ్ఛ క్రమంగా తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే కేంద్ర ప్రభుత్వం చెబుతున్న వాదనలను పూర్తిగా కొట్టిపారేయలేం. భారత ఉన్నత విద్యలో నాణ్యత అసమానంగా ఉంది. కొన్ని విశ్వవిద్యాలయాలు ప్రపంచ స్థాయిలో రాణిస్తుండగా, మరికొన్ని కనీస ప్రమాణాలకు కూడా చేరుకోవడం లేదు. నకిలీ డిగ్రీలు, నాణ్యతలేని ప్రైవేట్ కళాశాలలు, అనుమతుల ప్రక్రియలో అవినీతి వంటి సమస్యలు కూడా ఉన్నాయి. వీటిని పరిష్కరించడానికి సమగ్ర నియంత్రణ వ్యవస్థ అవసరమనే వాదనలో బలం ఉంది. ప్రశ్న మాత్రం ఒకటే-నాణ్యతను పెంచాలంటే అధికారాలన్నీ కేంద్రీకరించడమే ఏకైక మార్గమా? ఈ బిల్లుపై చర్చ మరో కోణాన్ని కూడా తెరపైకి తీసుకొచ్చింది. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం పలు రంగాల్లో అధికారాలను క్రమంగా తన వద్దకు కేంద్రీకరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. జీఎస్టీ అమలు తర్వాత రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యంపై జరిగిన చర్చల మాదిరిగానే, ఇప్పుడు విద్యా రంగంలో కూడా సమాఖ్య స్ఫూర్తి బలహీనపడుతుందా? అనే సందేహం వ్యక్తమవుతోంది. విద్య వంటి సున్నితమైన రంగంలో కేంద్రం, రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేయాల్సిన సమయంలో నియంత్రణ ఒకే కేంద్ర సంస్థ చేతుల్లోకి వెళ్లడం సమాఖ్య వ్యవస్థకు అనుకూలమా కాదా అన్నది ప్రధాన చర్చగా మారింది. ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలు కూడా ఇదే విషయాన్ని ప్రతిబింబిస్తున్నాయి. రాష్ట్ర విశ్వవిద్యాలయాలపై రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కొనసాగాలని, స్థానిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాలు రూపొందించే స్వేచ్ఛ ఉండాలని, కేంద్రం నాణ్యతా ప్రమాణాలను నిర్దేశించినా అమలులో రాష్ట్రాలకు నిర్ణయాత్మక పాత్ర కల్పించాలని ఆ రాష్ట్రం సూచించింది. ఇది కేవలం ఒక రాష్ట్రం సమస్య కాదు, దేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన అంశం. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఏకపక్షంగా అమలు చేయడం కంటే రాష్ట్రాలతో విస్తృతంగా చర్చించడం అవసరం. జాతీయ ప్రమాణాలు అవసరమే. కానీ వాటిని రూపొందించే ప్రక్రియలో రాష్ట్రాలకు సమాన భాగస్వామ్యం కల్పించాలి. కొత్త నియంత్రణ సంస్థ పాలక మండలిలో రాష్ట్రాలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలి. రాష్ట్ర విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి చట్టపరమైన హామీలు కల్పించాలి. ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా కొన్ని నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని రాష్ట్రాల వద్దే ఉంచాలి. "వికసిత్ భారత్" అనే లక్ష్యం కేవలం బలమైన కేంద్ర ప్రభుత్వంతోనే సాధ్యం కాదు. బలమైన రాష్ట్రాలు, స్వయం ప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయాలు, స్థానిక అవసరాలకు అనుగుణంగా పనిచేసే విద్యా వ్యవస్థ, దేశవ్యాప్తంగా ఒకే నాణ్యతా ప్రమాణాలు-ఈ నాలుగు కలిసి పనిచేసినప్పుడే నిజమైన విద్యా సంస్కరణ సాధ్యమవుతుంది. విద్యలో నాణ్యతను పెంచడం ఎంత అవసరమో, భారత సమాఖ్య వ్యవస్థను కాపాడటం కూడా అంతే అవసరం. ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించగలిగితేనే వికసిత్ భారత్ లక్ష్యం సార్థకమవుతుంది.

# ప్రతి ఒక్కరు సర్ లో పాల్గొని వేగవంతం చేయాలి

● బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**మిడ్జిల్,జూలై 14, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ) :**
ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ లో పాల్గొని ప్రతి ఒక్కరు పాల్గొని తమ ఓటును సురక్షితం చేసుకోవాలని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.అలాగే బి ఎల్ ఏ 2లు సహకరించి వేగవంతంవచేయాలని సూచించారు. జడ్చర్ల నియోజకవర్గంలో ఇప్పటి వరకు 50 శాతం కూడా పూర్తి కాలేదని తెలుస్తోందని అన్నారు.వంద శాతం సర్ ను పూర్తి చేసేందుకు బూత్ ల వారీగా నియమించిన బిజెపి బి ఎల్ ఓ లు ఫారాలు భర్తీ చేసి సహకరించాలని కోరారు.రాష్ట్ర పార్టీ అదేశాలమేరకు ఓటర్లు తమ వివరాలను అందజేసేందుకు ఈనెల 24 వరకు గడువు ఉందని, దీనిపై ఎలాంటి అపోహలు కలగకుండా గడువుకు ముందే సంబంధిత బిఎల్ఓలు, యువత సంబంధిత ప్రజలకు సరైన అవగాహన కల్పించి ఎస్ఐఆర్ ప్రక్రియను వందశాతం విజయవంతం చేయాలని కోరారు.

# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ సమగ్ర బ్రీఫింగ్





● అప్రమత్తత, క్రమశిక్షణతో విధులు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
● జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్



**మిడ్జిల్, జులై 14, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి గ్రామంలోని అమర రాజా గిగా కారిడార్లో ఏర్పాటు చేసిన సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ప్రారంభోత్సవం, ప్లాంట్ పర్యటన మరియు సమావేశ కార్యక్రమంకు విచ్చేయనున్న సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగనున్న హెలిప్యాడ్, ప్రారంభోత్సవ వేదిక, సమావేశ ప్రాంగణం, వీఐపీ రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సీఎం బందోబస్తు విధులకు హాజరైన అధికారులు, సిబ్బందికి సమగ్ర బ్రీఫింగ్ నిర్వహించి, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను అత్యంత అప్రమత్తతతో, సమన్వయంతో నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఇది ప్రతిష్ఠాత్మక పారిశ్రామిక సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం కావున భద్రతా పరంగా ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ప్రతి అధికారి, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. వీఐపీల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ నిర్వహణ, ప్రవేశ--నిష్క్రమణ ద్వారాలు, సమావేశ ప్రాంగణం తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే విధుల్లో ఉన్న ప్రతి పోలీసు అధికారి ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ బందోబస్తు విధుల్లో మొత్తం 450 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు. వీరిలో 1 జిల్లా ఎస్పీ, 1 అదనపు ఎస్పీ, 4 డీఎస్పీలు, 17 ఇన్‌స్పెక్టర్లు, 37 ఎస్ఐలు, 86 ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 286 పోలీస్ కానిస్టేబుళ్లు మరియు 18 హోంగార్డులు ఉన్నారు.ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ఆదేశించారు.

# "సర్" ఫారం తప్పనిసరిగా సమర్పించండి

● మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు చుక్క అల్లాజీ గౌడ్



**ఆమనగల్లు,జులై14(నేటి దర్శిని);**
ఓటర్ కార్డు ఉందని నిర్లక్ష్యం చేయొద్దని,మీ వద్ద ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) ఉన్నంత మాత్రాన మీ పేరు ఓటరు జాబితాలో శాశ్వతంగా ఉంటుందని భావించవద్దని ఆమనగల్లు మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు చుక్క అల్లాజీ గౌడ్ అన్నారు.సర్ ఫారం తప్పనిసరిగా అధికారులకు సమర్పించాలని,సర్ ఫారం సమర్పించకపోతే నిబంధనల ప్రకారం మీ పేరు ఓటరు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని,అప్పుడు మీ చేతిలో ఓటరు కార్డు ఉన్న ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి రావచ్చని ఆయన అన్నారు.సర్ ఫారాలను సమర్పించడానికి చివరి తేదీ 24/07/2026 గా పేర్కొన్నారని, అందువలన ఈరోజే మీ బీఎల్ఓ లను సంప్రదించి లేదా ఎన్నికల అధికారుల సూచనల ప్రకారం సర్ ఫారం సమర్పించి మీ ఓటు హక్కును భద్రపరచుకోవాలని,ఓటర్ల సవరణ ప్రక్రియ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆయన అన్నారు.నిర్లక్ష్యం చేస్తే శాశ్వతంగా ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని,ఎన్యుమరేషన్ ఫారమ్స్ జాగ్రత్తగా నింపి బూత్ లెవెల్ అధికారులకు తిరిగి ఇచ్చి మన ఓటును మనం కాపాడుకుందాం అని, 'మీ ఓటు మీ హక్కు మీ బాధ్యత'అని అల్లాజి గౌడ్ ఓటర్లకు సూచించారు.

# పారాక్వాట్ (గడ్డి మందు) నిషేధం దిశగా కేంద్రం తొలి అడుగు

● వరంగల్ ఎంపీ కడియం కావ్య కృషి ఫలితం
● పారాక్వాట్ నిషేధంపై కేంద్రం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారి
● హర్షం వ్యక్తం చేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
● రైతుల ప్రాణాలు, భూసారం రక్షణకు కీలక నిర్ణయం



**ఉమ్మడి వరంగల్, జులై 14 (నేటి దర్శిని బ్యూరో):**
దేశవ్యాప్తంగా పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)ను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం ముసాయిదా ((డ్రాఫ్ట్) నోటిఫికేషన్ జారీ చేయడంపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హర్షం వ్యక్తం చేశారు. రైతుల ప్రాణాలను కాపాడడంతో పాటు భూసారం, ప్రజారోగ్య పరిరక్షణకు ఈ నిర్ణయం కీలక మలుపుగా నిలుస్తుందని ఎంపీ పేర్కొన్నారు.పారాక్వాట్ డైక్లోరైడ్ వల్ల వ్యవసాయ భూముల సారవంతత దెబ్బతినడమే కాకుండా, రైతులు , వ్యవసాయ కార్మికుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని డాక్టర్ కడియం కావ్య గత కొంతకాలంగా ప్రస్తావిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గత పార్లమెంట్ సమావేశాల్లో మార్చి 27, 2026న లోక్‌సభలో ఈ అంశాన్ని లేవనెత్తిన ఎంపీ, దేశవ్యాప్తంగా పారాక్వాట్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.సాయిల్ హెల్త్ -- పబ్లిక్ హెల్త్" అనే నినాదంతో భూసారం పరిరక్షణ, ప్రజారోగ్య రక్షణ అంశాలపై నిరంతరం గళమెత్తిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తికి స్పందిస్తూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పారాక్వాట్ వినియోగంపై నిషేధం విధించింది. రాష్ట్ర ప్రభుత్వాలకు పరిమిత కాలం మాత్రమే నిషేధం విధించే అధికారం ఉండటంతో, దేశవ్యాప్తంగా శాశ్వత నిషేధం అవసరమని ఎంపీ కేంద్ర ప్రభుత్వ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు.ఈ క్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించడంతో పాటు వివిధ రాష్ట్రాల ఎంపీల మద్దతును కూడగట్టి పారాక్వాట్‌పై దేశవ్యాప్తంగా నిషేధం విధించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఆత్మహత్యలు, ప్రమాదవశాత్తు విషప్రయోగాల మరణాల్లో కూడా ఈ రసాయనం కీలక పాత్ర పోషిస్తోందని, దీనిపై తక్షణ చర్యలు అవసరమని ఎంపీ కోరారు.ఈ నేపథ్యంలో కేంద్ర వ్యవసాయ , రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పారాక్వాట్ డైక్లోరైడ్‌పై దేశవ్యాప్తంగా నిషేధం విధిస్తూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేయడం సంతోషకరమని ఎంపీ తెలిపారు. ఈ నిర్ణయం ప్రకారం పారాక్వాట్ డైక్లోరైడ్ దిగుమతి, తయారీ, విక్రయం, రవాణా, పంపిణీ, వినియోగంపై నిషేధం అమలు కానుంది.అయితే ఇది ప్రస్తుతం ముసాయిదా నోటిఫికేషన్ మాత్రమే కావడంతో, జూలై 13, 2026 నుంచి 30 రోజులపాటు అభ్యంతరాలు, సూచనలు స్వీకరించిన అనంతరం తుది నోటిఫికేషన్ జారీ కానుంది. పారాక్వాట్‌పై శాశ్వత నిషేధం త్వరలో అమల్లోకి రావాలని డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు.ప్రపంచంలోని 70కి పైగా దేశాలు ఇప్పటికే పారాక్వాట్‌ను నిషేధించిన నేపథ్యంలో, భారత ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతుల ఆరోగ్య రక్షణ, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి దోహదపడుతుందని ఎంపీ అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు.

# సర్"ను ఓటు ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

● చివరి తేదీ వరకు వేచి ఉండొద్దు
● మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్



**ఆమనగల్లు,జులై14(నేటి దర్శిని);**
ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి అర్హులైన ఓటరు సద్వినియోగం చేసుకొని, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్ కోరారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న సర్ ప్రక్రియను పరిశీలించిన అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో ఒకసారి తప్పనిసరిగా సరిచూసుకోవాలని సూచించారు.పేరు నమోదు కాకపోయినా, వివరాల్లో మార్పులు, చేర్పులు లేదా తొలగింపులు అవసరమైన సంబంధిత ఫారాలను పూర్తి చేసి బిఎల్ఓ లకు అందజేయాలని తెలిపారు.ప్రజలు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకుని బాధ్యతతో సర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మానయ్య ,శ్రీనివాస్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం,కో ఆప్షన్ సభ్యులు ఖాదర్,10వ వార్డ్ కౌన్సిలర్ కోగూరి అనితా శ్రీనివాసరెడ్డి, ఎంగలి ప్రసాద్,శ్రీశైలం, మహేష్,కుమార్ గౌడ్, శివ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# 113వ బూత్‌లో ఎస్ఐఆర్ ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు..

● ఓటరు జాబితా సవరణకు పజలకు అవగాహన



**నాగోల్, జూలై 14 (నేటి దర్శిని):**
నాగోల్ డివిజన్ పరిధిలోని త్యాగరాయ కాలనీలోని 113వ పోలింగ్ బూత్ వద్ద బీజేపీ నాయకుడు రాజు గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం నిర్వహించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొని హెల్ప్‌డెస్క్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటరు జాబితాలో కొత్త పేర్ల నమోదు, పేర్లలోని తప్పుల సవరణ, చిరునామా మార్పులు, ఇతర దరఖాస్తుల ప్రక్రియలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బూత్ స్థాయి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకుండా పోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు గౌడ్, వంశీ, శ్రీనివాస్‌తో పాటు బూత్ కార్యకర్తలు, స్థానిక నాయకులు మరియు పలువురు ప్రజలు పాల్గొన్నారు.



# జంగంరెడ్డి పల్లి లో హైమాస్ట్ లైట్ కు భూమి పూజ చేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి

**మిడ్జిల్, జులై 14, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** నారాయణపేట జిల్లా నర్వ మండలం జంగం రెడ్డి పల్లి గ్రామానికి మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణమ్మ ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి మంజూరు చేసిన హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు అరుణమ్మ ఆదేశానుసారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి స్థల పరిశీలన చేసి భూమి పూజ చేశారు

ఇట్టి కార్యక్రమం లో జంగంరెడ్డి పల్లి గ్రామ సర్పంచ్ మెట్ల భగవంతు, ఉప సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి, జిల్లా నాయకులు లలిత వెంకట రెడ్డి, నర్వ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్, టెలికాం మెంబర్ పసుల నీరజ్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి రాంపురం నరసింహ, పాతర్ చేడ్ బూత్ అధ్యక్షులు ఆర్మీ హనుమంతు, సాకలి బోజన్న, నర్వ వార్డు మెంబర్ పల్లె రామ్ రెడ్డి, గ్రామ పెద్దలు రాజేశ్వర్ రెడ్డి, హోటల్ అంజయ్య, అంజి, భగవంతు, తిప్పన్న, అనంతరెడ్డి, శ్రీకాంత్, అమరేష్, అమరచింత దీజీవీ నాయకులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# గౌడ జాతి, యాదాద్రి దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎల్బీనగర్‌లో బీసీ, గౌడ సంఘాల నిరసన

**ఎల్బీనగర్, జులై, 14 (నేటి దర్శిని):** గౌడ జాతి మరియు యాదాద్రి దేవాలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు బీసీ బిడ్డ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి అతని తండ్రి జక్కిడి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ, గౌడ మరియు బీసీ సంఘాలు ఎల్బీనగర్ చౌరస్తాలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించి ఈరోజు నిరసన తెలిపారు. అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూరెళ్ళ వేములయ్య గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి పలు బీసీ సంఘాల నేతలు గౌడ సంఘాల నేతలు పాల్గొని తమ గలాన్ని వినిపించారు. జక్కిడి శివ చరణ్ రెడ్డి ని తక్షణమే కాంగ్రెస్ పార్టీ యొక్క పదవుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాలపై అగ్రవర్ణాల ఆటలు ఇక సాగనివ్వమని ముక్తకంఠంతో తేల్చిచెప్పారు. బీసీల జోలికి వస్తే సంఘటితంగా ఎదుర్కొంటామని అన్నారు. ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం అయితే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రాజ్యాధికారమే దిశగా మేమెంతో మాకంత అనే నినాదంతో ముందుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ రాష్ట్ర అధ్యక్షులు అంబాల మల్లేష్ గౌడ్, కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐలి వెంకన్న గౌడ్,బీసీ సామైక్య రాష్ట్ర అధ్యక్షులు దుర్గయ్య గౌడ్, ఉద్యమ వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దేశగాని సాంబశివ గౌడ్, టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టి జానయ్య యాదవ్, అఖిల భారత గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్ద గొని నగేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బత్తిని సురేందర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బందారం అనిల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రవణ్ గౌడ్,రాష్ట్ర కార్యదర్శి చౌట బాలరాజ్ గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కొండా గిరి గౌడ్, ప్రధాన కార్యదర్శి బడేటి రాములు గౌడ్, రంగారెడ్డి జిల్లా ఆంజనేయులు గౌడ్, చెవిగోని సాయి గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మోకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు జక్కా వీరస్వామి గౌడ్ మరియు కార్యవర్గం, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేన అధ్యక్షులు పంజాల శ్రవణ్ గౌడ్, గౌడ సంఘం నాయకులు నక్రెకంటి శ్రీనివాస్ గౌడ్ జనగాం వెంకటేష్ గౌడ్, సర్దార్ శ్రీను, బెల్లంకొండ విజయ్ కుమార్ గౌడ్, పానుగంటి విజయ్ కుమార్ గౌడ్,బీసీ సంఘం నాయకులు గోదా వరుణ్ గౌడ్, బొంగు రఘు గౌడ్, బొంగు వెంకటేష్ గౌడ్, పాతూరి శ్రీధర్ గౌడ్, సాయి గౌడ్, లింగాల రాహుల్ గౌడ్, పటేల్ వెంకటేష్ గౌడ్, కృష్ణ గౌడ్ మెట్టు రవీందర్ గౌడ్. పోచబోయిన మహేష్ యాదవ్, సురేష్ యాదవ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ నాయకులు భైరు షేకర్ గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, పుష్ప గిరి, కే.వీ గౌడ్, మాజీ కౌన్సిలర్ ప్రేమనాథ్ గౌడ్, ముదగౌని జగన్ గౌడ్, సరూర్ నగర్ గౌడ సంఘం నాయకులు కందికంటి శ్రీధర్ గౌడ్, బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం నేత, కొండూరు శ్రీనివాస్ చారి పల్స రేణు గౌడ్ సత్య రాజ్ గౌడ్, సల్వాచారి, వడ్డరి సంఘం రాష్ట్ర నాయకులు దేరంగుల కృష్ణ, యాదవ్ హక్కుల పోరాట సమితి నాయకులు ఉపేంద్రా యాదవ్, టిఆర్పి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నీరజా గౌడ్, లింగాల కిషోర్ గౌడ్ చెరుకు చిరంజీవి గౌడ్ ఇందిరాల రమేష్ గౌడ్ చెరుకు ప్రవీణ్ గౌడ్ సతీష్ రాము గౌడ్, రమణ గౌడ్, కిషోర్ గౌడ్, ఎస్సీ సంఘాల నాయకులు ఏర్పుల బాల స్వామీ, వరంగల్ రమేష్ మరియు తదితర గౌడ సంఘాల నాయకులు బీసీ సంఘాల నాయకులు ఎస్సీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొని నిరసన తెలపడం జరిగింది.



# కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డికి గుర్రంపోడులో ఘన సన్మానం

- **జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనందుకు హర్షం**
- **మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులు**

**గుర్రంపోడు, జూలై 14 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డి కి గుర్రంపోడు మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో గుర్రంపోడు మండల మాజీ ఎంపీపీ చనమల మాధవి - జగదీశ్వర్ రెడ్డి, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చనమల యాదవ రెడ్డి పాల్గొని కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డికి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంకటేశ్వర్ రెడ్డి గారి నియామకంతో జిల్లాలో మరియు మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, పార్టీ పటిష్టతకు ఆయన నిరంతరం కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సన్మాన కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు మారపాక శంకర్, సూదిని జగదీశ్వర్ రెడ్డి, గుండెబోయిన కిరణ్, దాసరి సైదులు, గోగుల లింగయ్య, చాడ చక్రవర్తి, మారపాక నరేందర్, మారుపాక రాజశేఖర్ పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచులు కంచర్ల జగదీశ్ రెడ్డి, ఊర వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ కట్ట నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు ఎరెడ్ల వెంకట్ రెడ్డి, మామిడి పెద్దలు, వలిశెట్టి వెంకటయ్యలు హాజరయ్యారు. వీరితో పాటు వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు పగిడిమర్రి వెంకటయ్య, రేపాక నర్సింహా, అంబేద్కర్ మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# ఎంపీ మల్లు రవికి జన్మదిన శుభాకాంక్షలు

- **తెలిపిన ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు**

**ఆమనగల్లు, జులై 14(నేటి దర్శిని):** తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్,నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి జన్మదినం సందర్భంగా హైదరాబాదులోని బేగంపేట ఎయిర్పోర్ట్ లో మంగళవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో శాలువాలతో మల్లు రవిని సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి వారిని అభినందించారు. ఈ పుట్టినరోజు మీ జీవితంలో సరికొత్త కాంతిని,నిండైన ఆనందాన్ని ఆయురారోగ్యాలను ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నట్లు గుర్రం కేశవులు ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి మధుసూదన్ రెడ్డి,ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు బికుమండ్ల రమేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



# ఠాగూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన కార్యక్రమం..



**కొత్తపేట, జూలై 14 (నేటి దర్శిని):** కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్ నగర్ చౌరస్తాలో జై శ్రీరామ్ సేవా సమితి అధ్యక్షులు ఠాగూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు స్వయంగా అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకోటి పవన్ కుమార్ మాట్లాడుతూ, “అన్నదానం మహాదానం” అని భారతీయ సంస్కృతి చెబుతోందని, ఆకలితో ఉన్న వారికి భోజనం పెట్టడం కంటే గొప్ప దానం మరొకటి లేదన్నారు. సమాజ సేవా దృక్పథంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. జై శ్రీరామ్ సేవా సమితి అధ్యక్షులు, బీజేపీ రంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఠాగూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా ప్రతి అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 500 మందికి పైగా భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కొత్తపేట డివిజన్ వైస్ ప్రెసిడెంట్ డి. సంగ్రామ్, ప్రవీణ్ కుమార్, మల్లికార్జున్, భాను ప్రకాష్, భరత్ రాజ్, వీరేష్, తనుష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ..

- **భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పిలుపు**





**హయత్‌నగర్ జూలై 14 (నేటి దర్శిని):** హయత్‌నగర్ మండల కార్యాలయ ఆవరణలోని శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రతి సంవత్సరం వైభవంగా నిర్వహించే శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మంగళవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026 ఆగస్టు 11న నిర్వహించనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, సమాజంలో భక్తి భావాన్ని, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ గ్రామ పెద్ద కళ్లెం శంకర్ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చెన్నగౌని శ్రీధర్ గౌడ్, ఆలయ గౌరవ అధ్యక్షులు పారంద స్వామి, మాజీ అధ్యక్షులు ఎర్ర రవీందర్, ప్రస్తుత అధ్యక్షులు క్యాదాస్ సతీష్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పిట్టల జంగం ముదిరాజ్, పారంద అరవింద్, ఇతర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# దేవాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం

● పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్ చెరు జులై 14 (నేటి దర్శిని)
సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం రామచంద్రాపురం లో నూతన దేవాలయాల నిర్మాణాలకు, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెలిమెల తండాలో గల భవాని మాత దేవాలయంలో విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి సొంత నిధులతో నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తాండా ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి: జిల్లా కలెక్టర్



ఉమ్మడి వరంగల్, జూలై 14 (నేటి దర్శిని బ్యూరో):
ప్రభుత్వ పాఠశాలలో సృజనాత్మకమైన విద్య అందించాలంటే ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద అన్నారు. వరంగల్ నగరంలోని శంభునిపేట, కరీమాబాదులో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్ ఎల్ ఎన్, ఏ ఐ ఆధారిత బోధన పద్ధతి, డిజిటల్ లెర్నింగ్ వంటి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యాస ఫలితాలు మెరుగుపరచాలని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మండలంలో ఓటర్ ఎన్యుమరేషన్ ను పరిశీలించిన: మండల బూత్ ఇంచార్జ్ యేకుల సురేష్

● ఓటర్ ఎన్యుమరేషన్ ఫారాలు నింపివ్వడం త్వరితగతిన పూర్తయ్యేలాచూడాలి
● ఓటు మన ప్రాథమిక హక్కు - నమోదు చేసుకోవడం మన బాధ్యత! : యేకుల సురేష్





కొండమల్లేపల్లి, జూలై 14 ( నేటి దర్శిని):
నల్గొండ జిల్లా దేవరకొండ నియోజక వర్గం కొండ మల్లెపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఓటర్ ఎన్యుమరేషన్ (ఓటరు నమోదు) ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా సాగుతున్న ఈ నమోదు ప్రక్రియను దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ సూచన మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ కొండ మల్లెపల్లి మండల పలు బూత్ ల ఇంచార్జ్ యేకుల సురేష్ వివిధ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.ఇందులో భాగంగా చెన్నమనేని గ్రామ పంచాయతీ పరిధిలోని స్థానిక పోలింగ్ బూత్‌ను ఆయన సందర్శించి, రిజిస్ట్రేషన్ పనుల పురోగతిని, పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ ఎన్యుమరేషన్ ఫారాలను ప్రజలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. స్వయంగా రంగంలోకి దిగి పలు ఎన్యుమరేషన్ ఫారాలను నింపడంలో ప్రజలకు సహాయం చేస్తూ, సకాలంలో వివరాలను నమోదు చేసుకునేలా ప్రోత్సహించారు. ఓటరు నమోదులో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ బాధ్యతని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ శ్రీపతి , ఆయనతో పాటు జీపీఓ అమర్, పంచాయతీ సెక్రెటరీ చిలుముల విజయ్, బిఎల్ఓ రేణుక, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనయ్య, బిఎల్ఏ మరియు పలువురు స్థానిక సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గుర్రంపోడులో ఏఐటీయూసీ నల్లగొండ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

● జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు
● ఘనంగా మహాసభల కరపత్రాల ఆవిష్కరణ




గుర్రంపోడు, జూలై 14 (నేటిదర్శిని):
కార్మిక హక్కుల రక్షణ కోసం నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నల్లగొండ జిల్లా 11వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గుర్రంపోడు మండల కేంద్రంలో ఈనెల 19వ తేదీన జరిగే జిల్లా మహాసభల గోడపత్రికలు, కరపత్రాలను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గత 107 సంవత్సరాలుగా దేశంలో కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతున్న ఏకైక అతిపెద్ద కార్మిక సంఘం ఏఐటీయూసీ అని కొనియాడారు. కార్మికులు ప్రాణాలర్పించి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి, కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి డిమాండ్లు
కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మనెంట్ చేయాలని, కనీస వేతనాల చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. అలాగే హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ఒక సమగ్రమైన ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 19వ తేదీ ఆదివారం నాడు గుర్రంపోడులో నిర్వహించే ఏఐటీయూసీ నల్లగొండ జిల్లా 11వ మహాసభలకు జిల్లాలోని కార్మికులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల గౌరవ అధ్యక్షులు రేపాక లక్ష్మీపతి, మండల అధ్యక్షులు ఎస్కే అమీర్, ప్రధాన కార్యదర్శి జాల పెద్ద నరసింహ, ఉపాధ్యక్షులు జాల చిన్న నరసింహ, నాయకులు పోలేపల్లి లింగయ్య, పోలేపల్లి లాలయ్య, పగిడిమర్రి లింగయ్య, ఎస్.కె మమ్మద్, ఎస్.కె ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# మానవసేవే...మాధవ సేవ...

● అమావాస్య అన్నదాన మహా ప్రసాదానికి భక్తుల వెల్లువ..
● 700 మందికి మహా ప్రసాదం అందించిన కృష్ణ గోపాల్ సేవా సమితి







కొత్తపేట, జూలై 14 (నేటి దర్శిని):
కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అమావాస్య అన్నదాన మహా ప్రసాద కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో సుమారు 600 నుంచి 700 మంది భక్తులు పాల్గొని మహా ప్రసాదాన్ని స్వీకరించారు. సేవా భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో భక్తులు, స్థానికులు సమితి సభ్యులను అభినందించారు. కార్యక్రమం నిర్వహణలో సమితి సభ్యులు, కార్యకర్తలు, దాతలు విశేషంగా కృషి చేశారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సమితి సభ్యులు, కార్యకర్తలు, దాతలు మరియు సేవాభావంతో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "భగవంతుడు మీ అందరి సేవాభావాన్ని ఆశీర్వదించి, ప్రతి ఒక్కరి మనోకాంక్షలను నెరవేర్చాలని హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. సమాజ సేవను ధ్యేయంగా తీసుకుని కృష్ణ గోపాల్ సేవా సమితి నిరంతరం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, "మానవ సేవే మాధవ సేవ" అనే నినాదంతో ముందుకు సాగుతోందని సమితి ప్రతినిధులు తెలిపారు.

# అధికారుల అండతో చెలరేగుతున్న రేషన్ మాఫియా..!?

● జర్నలిస్టుల అప్రమత్తతతో ఆటో పట్టివేత
● "డాన్ బబ్లు, యూసఫ్ దే సరుకు" ఆటో డ్రైవర్
● జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్లకి ముడుపులు ఇస్తున్నాం..!?
● రంగారెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారుల అండతో చెలరేగుతున్న మాఫియా..!?
● బొంగులూరు గేటు, (మంగళపల్లి), పెద్ద అంబర్‌పేటలో యథేచ్ఛగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా







హైదరాబాద్,జూలై14(నేటి దర్శిని):
ప్రజలకు అందాల్సిన పేదల రేషన్ బియ్యం అక్రమ రవాణా మళ్లీ జోరందుకుంది. మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో టీఎస్--08--యూఎల్--9896 నంబర్ గల ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జర్నలిస్టులు గుర్తించి పోలీసులకు అప్పగించడం కలకలం రేపింది. ఈ ఘటనతో అక్రమ రేషన్ బియ్యం మాఫియా కార్యకలాపాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. పోలీసుల ఎదుట ఆటో డ్రైవర్ చేసిన వ్యాఖ్యలు మరింత సంచలనంగా మారాయి. తాను తరలిస్తున్న బియ్యం "డాన్ బబ్లు, యూసఫ్ "కు చెందినదేనని చెప్పినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి అసలు సూత్రధారులను బయటకు తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు పదేపదే ఆరోపణలు వస్తున్నప్పటికీ రంగారెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారులు మాత్రం దాడులు నిర్వహించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. బొంగులూరు గేటు (మంగళపల్లి), పెద్ద అంబర్‌పేట ప్రాంతాల్లో బహిరంగంగానే రేషన్ బియ్యం కొనుగోలు, నిల్వ, తరలింపు జరుగుతోందని స్థానికులు చెబుతున్నా అధికారుల స్పందన లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో అక్రమ రేషన్ బియ్యం సరఫరాదారులతో కొంతమంది అధికారులకు ముందస్తు ఆర్థిక ఒప్పందాలు ఉన్నాయా.? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. తరచూ సమాచారం అందుతున్నా దాడులు లేకపోవడం, అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ దాడులతో అక్రమ దందాకు కొంతమేర అడ్డుకట్ట పడినప్పటికీ, ప్రస్తుతం మళ్లీ అదే మాఫియా రెచ్చిపోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ అధికారులు, మీర్‌పేట పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణా కేంద్రాలపై రేషన్ బియ్యం దాన్లుగా పేరు పొందుతున్న బబ్లు, యూసఫ్ గోదాములను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వరుస దాడులు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం పేదల కోసం కేటాయిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా మళ్లించి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందులో ప్రమేయం ఉన్న వారెవ్వరైనా చట్టం ముందు నిలబెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అయితే, డ్రైవర్ ఉమర్ ఇచ్చిన సమాచారం మేరకు నిర్వాహకులు బబ్లు, యూసఫ్ పై కేసులను నమోదు చేయాలని దానితో కొంతమేర కట్టడి అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. కేసు నెంబర్ 949/2026 కేసు నమోదు చేసినట్లు మీర్ పేట పోలీసులు తెలిపారు.

# రాకా'లో మరో హీరోయిన్ ఫిక్స్..

## అల్లు అర్జున్ సినిమాపై అంచనాలు పెంచిన నైలా గ్రేవల్ !



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్-వరల్డ్ చిత్రం 'రాకా' పై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉండగా, చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. ఇప్పటికే ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే, ఈ సినిమాలో ఒకరికి మించి పలువురు హీరోయిన్లు కనిపించనున్నారనే ప్రచారం గత కొంతకాలంగా సాగుతోంది. మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి పలువురు స్టార్ హీరోయిన్ల పేర్లు కూడా వినిపించాయి.ఇటీవల మలయాళ నటి ఫెమినా జార్జ్ తాను కూడా 'రాకా'లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించగా, ఇప్పుడు మరో కొత్త పేరు ఈ ప్రాజెక్ట్‌లో చేరింది. పంజాబీ నటి నైలా గ్రేవల్ కూడా ఈ సినిమాలో నటిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన నైలా గ్రేవల్, "దర్శకుడు అట్లీతో పని చేయాలని చాలా కాలంగా కోరుకుంటున్నాను. ఇప్పుడు ఆ అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉంది. బాలీవుడ్‌లో మాత్రమే పనిచేసిన నన్ను ఇలాంటి భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు ఎంపిక చేయడం గౌరవంగా భావిస్తున్నాను. 'రాకా'లో భాగమవడం నా కెరీర్‌లో ప్రత్యేకమైన మైలురాయి" అని చెప్పింది. నైలా గ్రేవల్ ఇప్పటికే 'తమాషా', 'బరేలీ కి బర్ఫీ', 'తప్పడ్', 'ఇష్క్ విశ్క్ రీబౌండ్' వంటి హిందీ చిత్రాల్లో నటించి గుర్తింపు పొందింది. అలాగే ఓ ప్రముఖ నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్‌లోనూ మెప్పించింది. ఇప్పుడు అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. 'రాకా'లో పలువురు నటీనటులు భాగమవుతున్న నేపథ్యంలో సినిమా కథ, పాత్రలపై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. అట్లీ తన మార్క్ కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సైన్స్ ఫిక్షన్ టచ్ జోడిస్తూ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, మిగిలిన నటీనటులు, కథకు సంబంధించిన వివరాలను మేకర్స్ దశలవారీగా అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే దేశవ్యాప్తంగా భారీ హైప్‌ను సొంతం చేసుకుంటోంది.




# 'లెనిన్'జోరు ..

## నాలుగు రోజుల్లో ఎంత వసూలు చేసింది అంటే..!




ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటి నుంచి అఖిల్ అక్కినేని నటించిన 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. తొలి మూడు రోజుల్లోనే రికార్డు స్థాయి వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. నాలుగో రోజు కలెక్షన్లలో మాత్రం సహజమైన డ్రాప్‌ను నమోదు చేసింది. అయినప్పటికీ మొత్తం వసూళ్ల పరంగా దూసుకెళ్తూ అఖిల్ కెరీర్‌లోనే అతిపెద్ద కమర్షియల్ హిట్‌గా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అఖిల్ పవర్‌ఫుల్ యాక్షన్, భాగ్యశ్రీ బోర్సే నటన, ఎస్. థమన్ అందించిన సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా మాస్ సెంటర్లలో సినిమాకు మంచి ఆదరణ లభిస్తుండటంతో విడుదలైన తొలి రోజు నుంచే కలెక్షన్ల పరంగా దూసుకుపోతోంది.మొదటి రోజే ప్రపంచవ్యాప్తంగా రూ.16.7 కోట్ల గ్రాస్ వసూలు చేసి అఖిల్ కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ నమోదు చేసిన ఈ చిత్రం, వీకెండ్ ముగిసే సమయానికి మూడు రోజుల్లో రూ.61.1 కోట్ల గ్రాస్ సాధించి సంచలనం సృష్టించింది. ఈ జోరుతో డిస్ట్రిబ్యూటర్ల పెట్టుబడులు కూడా వేగంగా రికవరీ అవుతున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్ తర్వాత వచ్చే సోమవారం దాదాపు అన్ని సినిమాల కలెక్షన్లు తగ్గడం సాధారణమే. అదే పరిస్థితి 'లెనిన్'కు కూడా ఎదురైంది. అడ్వాన్స్ బుకింగ్స్ పరంగా మంచి స్పందన కనిపించినప్పటికీ, నాలుగో రోజు ప్రపంచవ్యాప్తంగా సినిమా రూ.6.1 కోట్ల గ్రాస్ మాత్రమే రాబట్టింది.వీశీజఅవం దీంతో నాలుగు రోజుల ముగింపుకు ఈ చిత్రం మొత్తం రూ.67.2 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ వసూలు చేసినట్లు నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో, కేవలం నాలుగు రోజుల్లో రూ.67.2 కోట్ల గ్రాస్‌తో బ్లాక్‌బస్టర్ ప్రయాణం కొనసాగుతోంది అంటూ మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్దగా పోటీ సినిమాలు లేకపోవడం 'లెనిన్'కు కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. మరోవైపు పాజిటివ్ మౌత్ టాక్ కూడా సినిమాకు బలంగా నిలుస్తోంది. అయితే వీకెండ్‌తో పోలిస్తే సోమవారం కలెక్షన్లు గణనీయంగా తగ్గడం ట్రేడ్ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇక రాబోయే రోజుల్లో వసూళ్లు నిలకడగా కొనసాగితే రూ.100 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ క్లబ్ చేరడం పెద్ద కష్టమేమీ కాదని, లేదంటే ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.




# రామ్ చరణ్-సుకుమార్ సినిమాలో నయనతార..

## పవర్‌ఫుల్ పాత్రలో లేడీ సూపర్ స్టార్?

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న RC17' చిత్రంపై అంచనాలు రోజురోజుకూ ఆకాశాన్ని తాకుతున్నాయి. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో వరల్డ్ వైడ్‌గా ఈ ప్రాజెక్ట్‌పై భారీ హైప్ క్రియేట్ అయింది. అయితే ఇప్పటివరకు ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు అనే విషయంపై మేకర్స్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ తరుణంలో ఈ సినిమా కాస్టింగ్ గురించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన ప్రచారం జోరందుకుంది. లేడీ సూపర్ స్టార్ నయనతార ఈ చిత్రంలో భాగం కానున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో బలంగా టాక్ వినిపిస్తోంది. అయితే ఆమె ఈ సినిమాలో కథానాయికగా కాకుండా, కథను మలుపు తిప్పే ఒక కీలకమైన, ఎంతో ప్రాధాన్యత కలిగిన పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం.సాధారణంగా దర్శకుడు సుకుమార్ రాసుకునే ప్రతి పాత్రకు ఒక బలమైన గుర్తింపు, ప్రాముఖ్యత ఉంటాయి. 'రంగస్థలం' చిత్రంలో ప్రతి క్యారెక్టర్‌ను అద్భుతంగా డిజైన్ చేసిన సుకుమార్.. RC17'లో కూడా నయనతార కోసం ఒక పవర్‌ఫుల్ రోల్‌ను సిద్ధం చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే, నయన్ రాకతో ఈ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ రావడం ఖాయం. మరోవైపు, తెలంగాణ నేపథ్యంలో సాగే పక్కా రూటెడ్ నేటివిటీ స్టోరీగా ఈ సినిమా తెరకెక్కనుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో నయనతార పాత్రపై వస్తున్న వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియాలంటే చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# 'తుంబాడ్ 2' లోకి ఆలియా భట్..

## క్రేజీ అప్‌డేట్‌తో సోషల్ మీడియా షేక్!



భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్' (఑బఎఎమ్బస). ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహుమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది" అంటూ సోహుమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్దిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపిందిఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# నాగచైతన్య కొత్త సినిమా?



ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అక్కినేని నాగచైతన్య 'వృషకర్మ' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. ఈ సినిమా తర్వాత చేయాల్సిన ప్రాజెక్ట్‌ని కూడా నాగచైతన్య ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. 'బెదురులంక 2012' చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న క్లాక్స్ దర్శకత్వంలో ఆయన తర్వాత సినిమా ఉంటుంది. ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో సెట్స్ పైకి తీసుకెళ్లే యోచనలో చైతూ ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ క్రమంలోనే 'మసూద' దర్శకుడు సాయికిరణ్ కూడా ఇటీవలే చైతూకి కథ వినిపించారట. తన తొలి సినిమా 'మసూద'తో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న సాయికిరణ్, గత రెండేళ్లుగా ఓ హారర్ థ్రిల్లర్ స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. ఏషియన్ సునీల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసమే చైతూని సాయికిరణ్ కలిసినట్టు, కథ వినిపించినట్టు తెలిసింది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకెళ్లే అవకాశం ఉన్నది.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365